ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 27.0

ఊరూ వాడా బదిలీలు

- తాజాగా పచ్చ జెండా ఊపిన ప్రభుత్వం
- ఐదేళ్లు దాటితే ఉన్న చోటు నుంచి కదలాల్సిందే.. 15 శాఖలకే బదిలీల్లో చోటు
- టీచర్లు, వైద్య సిబ్బందికి బదిలీలు నో
- 19 నుంచి 31 లోపే ఈ ప్రక్రియ ముగింపు
- ఈసారి కూడా పాత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లానే ప్రాతిపదిక

7



దేశం గర్వించే రీతిలో.. విద్యార్థులు ఎదగాలి

- ఐఐటీ అల్యుమ్ని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ
- ఏపీ నిట్‌లో ఘనంగా స్నాతకోత్సవం

వైద్య సేవలు బంద్

ఐఎంఏ పిలుపునకు విశేష స్పందన.. ఆస్పత్రి విధుల నిర్వహణలో వైద్యులు, ఆరోగ్యసిబ్బంది భద్రతకు డిమాండ్



మహిళలకు రక్షణ కల్పించాలంటూ ఏలూరు నగరంలో వైద్యుల ర్యాలీ

ఏలూరు అర్బన్/ఏలూరు క్రైం/ఏలూరు టూటౌన్, ఆగస్టు 17 : కోల్‌కతా ఆర్జీ కర్ హాస్పిటల్‌లో పీజీ ట్రైనీ వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని, తదనంతరం హాస్పిటల్‌లో రౌడీమూకల విధ్వంసకర పరిణామాలను నిరసిస్తూ వైద్యులు, సిబ్బంది భద్రత కోసం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం దేశవ్యాప్తంగా అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు వైద్యసేవలను నిలిపివేస్తూ నిర్వహించతలపెట్టిన 24 గంటల బంద్‌కు విశేష స్పందన లభించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటురంగంలో వున్న 1340 చిన్న, పెద్ద ఆస్పత్రులు, క్లినిక్‌లు, నర్సింగ్ హోంలలో ఓపీ సేవలు, సర్జరీలను నిలిపివేసి బంద్‌కు సంఘీభావాన్ని ప్రకటించారని ఐఎంఏ-హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ ఇండియా జాతీయ వైస్‌ఛైర్మన్ డాక్టర్ సి.శ్రీనివాసరాజు తెలిపారు. కొన్ని ఆస్పత్రుల్లో మాత్రం అత్యవసర కేసులు, ఇప్పటికే ఐసీయూలో చికిత్సపొందుతున్న రోగులకు వైద్యచికిత్సలు కొనసాగించారు. ప్రైవేటు ఆస్పత్రుల బంద్ సమాచారం తెలియని రోగులు, వారి కుటుంబసభ్యులు సంబంధిత హాస్పిటల్స్‌కు వచ్చి వెనుదిరిగారు. ఒక్కో ప్రైవేటు ఆస్పత్రికి రోజుకు సగటున 150 వరకు అవుట్ పేషెంట్ కేసులుంటా యని అంచనాగా ఉంది. ఆస్పత్రుల బంద్‌కు రోగనిర్ధారణ కేంద్రాలు, ల్యాబ్‌లు సంఘీభావాన్ని ప్రకటించాయి. కాగా ఉమ్మడి జిల్లాలోని డీసీహెచ్‌ఎస్, డీఎంఈ పరిధిలో పనిచేసే జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది కొద్దిసేపు విధులను నిలిపివేసి కోల్‌కతా ఘటనలకు నిరసిస్తూ నిరసనలు తెలిపారు. డీఎంహెచ్‌వో పరిధిలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది స్థానికంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారని కార్యాలయ వర్గాలు తెలిపాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో యూజీ, పీజీ వైద్యవిద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, రెసిడెంట్ వైద్యులు 24 గంటల బంద్‌లో పాల్గొన్నారు. కొన్నిచోట్ల కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.



ఫైర్ స్టేషన్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు,విద్యార్థులు

కేంద్రప్రభుత్వ స్పందన మేరకు తదుపరి ఆందోళనపై నిర్ణయం

ఆస్పత్రుల్లో విధినిర్వహణలో వున్న వైద్యులు, సిబ్బంది, వైద్యవిద్యార్థుల భద్రతకు చట్టాన్ని తెస్తామని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ హామీనివ్వడం హాస్యాస్పదంగా ఉందని, వాస్తవానికి ఈ చట్టాన్ని తీసుకురావాల్సిందిగా కేంద్ర హోంమంత్రిత్వశాఖను ఐఎంఏ పలుమార్లు అభ్యర్థించినా స్పందన లేకపోవడం వల్లే కోల్‌కతా వంటి దుస్సంఘటనలు జరగడానికి కారణమవుతున్నాయని ఐఎంఏ-హెచ్‌బీఐ వైస్‌ఛైర్మన్ డాక్టర్ శ్రీనివాసరాజు దుయ్యబట్టారు. దేశంలో డెంగీ, మలేరియా కేసుల ఉధృతి పెరుగుతున్నందున తక్షణమే బంద్/సమ్మెను విరమించి విధుల్లోకి చేరాలని కేంద్రప్రభుత్వం కోరిందని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు, చట్టాన్ని తీసుకువచ్చేందుకు ఓ కమిటీని నియమించి, అందరినుంచి సూచనలు, సలహాలు స్వీకరించడానికి ప్రభుత్వం శనివారం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి ఆందోళన కొనసాగింపుపై ఐఎంఏ, ఫోర్డా(ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్) తదితర సంఘాలు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

కోల్‌కతాలో పీజీ ట్రైనీ వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి హతమార్చిన హంతకులను కఠినంగా శిక్షించాలని ఏలూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు, మెడికోలు, నర్సులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో శనివారం ఉదయం విధులను బహిష్కరించి ఆస్పత్రి నుంచి ఫైర్‌స్టేషన్‌కు భారీ ర్యాలీ నిర్వహించారు. ఫైర్‌స్టేషన్‌లో కొద్దిసేపు నినాదాలు చేశారు. ఆస్పత్రి ఆవరణ లోని ఆమె రెస్టరూమ్‌లోనే ఈ దారుణం జరగడం చూస్తే వైద్యులకు రక్షణ ఏదీ..? అంటూ ప్రశ్నించారు. తక్షణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి అన్ని ఓపీ విభాగాలను పూర్తిగా నిలిపి వేశారు. ఆర్ఎంవో డాక్టర్ దుర్గాకుమార్ 7వ నెంబర్ జనరల్ మెడిసిన్ విభాగంలో ఉండి ఆస్పత్రికి వచ్చిన వారికి ప్రాథమిక వైద్య సేవలు అందించారు.

కోల్‌కతా ఘటన అమానుషం : ఎంపీ

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ తెలిపారు. ఈ ఘటన అమానుషమన్నారు. దోషులు ఎంతటి వారైన కఠినంగా శిక్షించాలన్నారు.



ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఖాళీగా ఉన్న ఓపీ విభాగం

20 టన్నుల సామర్థ్యానికి మించిన వాహనాలను అనుమతించొద్దు

- కలెక్టర్ కె వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, ఆగస్టు 17 : జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు స్టాక్ పాయింట్ల వద్దకు 20 టన్నులకు మించి సామర్థ్యం కలిగిన వాహనాలను అనుమతించవద్దని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఒక్క టన్ను ఇసుక కూడా అక్రమ రవాణా జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఒక వ్యక్తికి (ఆధార్ కార్డు) 20 టన్నులకు మించి మంజూరు చేయరు కనుక స్టాక్ పాయింట్ల వద్దకు 20 టన్నుల సామర్థ్యానికి మించి వాహనాలను అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇసుక కమిటీలో తీర్మానం చేశామన్నారు. కుక్కునూరు మండలం లోని ఇబ్రహీంపేట, వింజరం, ఉంగుటూరు మండలంలోని చేబ్రోలులో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. గనుల శాఖ సిబ్బంది ఒకరు ప్రతీ రోజు స్టాక్ పాయింట్లను పరిశీలించి ప్రతివారం నివేదిక ఇవ్వాలన్నారు. గనుల శాఖ డీడీ రవి కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మీ విధులేమిటో తెలియదా..?

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ విశ్వనాథ్ ఆగ్రహం
- ఎనిమిది మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

దెందులూరు, ఆగస్టు 17 : 'మీ ప్రభుత్వ శాఖకు సంబంధించి వివరాలు కూడా తెలియకపోవడం ఎంత వరకు సబబు. మీ పై అధికారుల ఫోన్ నెంబర్‌లు సైతం చెప్పలేకపోతున్నారు. మీ విధులు, పథకాల పేర్లు, ప్రజలకు మీరందించే సేవల వివరాలను సైతం చెప్పలేకపోవడం దారుణం'.. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ విశ్వనాథ్ ఎనిమిది మంది సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలంలోని సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో శ్రీలత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. శ్రీరామవరం, దెందులూరు, రామారావుగూడెం తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఎంలు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఉద్యానవనశాఖ సిబ్బంది, వ్యవసాయశాఖ అసిస్టెంట్‌లు నెల రోజుల్లో 22 రోజుల పాటు 11 గంటలకు విధులకు హాజరుకావడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారికి సంబంధించిన విధులు, అందించే సేవలపై ప్రశ్నించగా చెప్పలేకపోవడంతో డీపీవో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ ఎనిమిది మంది సచివాలయ ఉద్యోగులకు షోకేజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈసందర్భంగా



సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్

డీపీవో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించడంతో పాటు సంబంధిత శాఖకు సంబంధించిన వివరాలు, ప్రభుత్వ పథకాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవోపీఆర్డీ స్వామి, సర్పంచ్ తోట ఏసమ్మ, టీడీపీ నేతలు గారపాటి కొండయ్య చౌదరి, యిప్పిలి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- ప్రస్తుతం ఈ-పంట నమోదు కార్యక్రమం
- 2024-25 ఖరీఫ్ సీజన్‌లో 2.30 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు
- దిగుబడి లక్ష్యం 6.80 లక్షల మెట్రిక్ టన్నులు
- ధాన్యం మద్దతు ధర క్వింటాలుకు కామన్ రకానికి రూ. 2300- ఏ-గ్రేడ్ రకానికి రూ. 2320

ఏలూరు సిటీ, ఆగస్టు 17 : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో లేని విధంగా ఈసారి ధాన్యం కొనుగోలు చేయడానికి ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లాలో వరి పండించే ప్రతి గ్రామంలోను రైతు సేవా కేంద్రానికి ఆ గ్రామం యొక్క దిగుబడి ప్రకారం ఏ, బీ, సీ లుగా కేటగిరీ చేసి ప్రొక్యూర్‌మెంట్ సపోర్టింగ్ సంస్థలచే ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేస్తారు. గతంలో మాదిరిగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ ధాన్యం కొనుగోలు చేస్తారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వ్యవసాయ శాఖచే నమోదు చేయబడిన ఈ-పంట ఆధారంగా మాత్రమే జరుగుతుంది. ధాన్యం పండించే రైతుల ఖచ్చిత వివరాలు పూర్తి పారదర్శకంగా ఈ-పంటలో నమోదు చేసి ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాల కాల పట్టికను రూపొందించారు. ధాన్యం కొనుగోలులో భాగంగా గోనెసంచులు ఏర్పాటు చేసి రవాణా వాహనాలు సమకూర్చి రైతుల సౌలభ్యం కోసం ధాన్యాన్ని రైతుల పంటపొలాల్లోని కల్లాల నుంచే సేకరించి ర్యాండమైజేషన్ పద్ధతిలో కాకుండా సమీప రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించడం ద్వారా కొనుగోలు చేస్తారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి మాసూళ్ల ప్రారంభం కాగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ధాన్యం కొనుగోలు సన్నాహాలపై ఇప్పటికే సివిల్ సప్లయిస్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏది ఏమైనా ఈ సారి ధాన్యం కొనుగోలుకు సంబంధించి ముందస్తుగానే సివిల్ సప్లయిస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మాల జాతి యోధుల పోరాట సంఘ ప్రతినిధులు

వర్గీకరణపై సుప్రీం తీర్పు పునః సమీక్షించాలి

మాలజాతి యోధుల పోరాట సంఘం భారీ ర్యాలీ..ధర్నా

ఏలూరు రూరల్, ఆగస్టు 17: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పును పునః సమీక్షించాలని కోరుతూ మాల జాతి యోధుల పోరాట సంఘం ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. తొలుత స్థానిక పాత బస్టాండు సెంటర్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మెండెం సంతోష్‌కుమార్, నేతల రమేష్‌బాబు, నూకపొయ్యి కార్తీక్, ప్రొఫెసర్ దాసరి రమేష్, అలగా రవి, యెరికపాటి విజయ్ తదితరులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి మెజార్టీ జనాభా కలిగినా 15 శాతం రిజర్వేషన్‌లకు పరిమితమై విద్యా, ఉద్యోగాల్లో ఇబ్బందులు పడుతుంటే రిజర్వేషన్ పెంచే ఆలోచన చేయని కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇటువంటి తీర్పుకు మద్దతు తెలిపాయన్నారు. ప్రైవేట్ రంగ సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని, తొలుత జన, కులగణన జరిగిన తర్వాతే పార్లమెంట్ ఆమోదంతో రాజ్యాంగబద్ధంగా వర్గీకరణ జరగాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. యెరికపాటి విజయ్, మత్తేబాబి, కాపుదాసి రవి, నాగేంద్రకుమార్, ఎం.సత్యనారాయణ, చిన్నం సునీల్, పారబండి బాబురావు, అబ్బూరి అనిల్, గొల్లా కిరణ్, గొల్లా నరేష్, ఈపిజర్ల మణిరాజు, మాత్రపు లోకేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, ఆర్.సాము మాన్‌సింగ్ పెద్దసంఖ్యలో మాలసంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఓ వార్డులో జ్వరపీడితులు

ఫీవర్.. ఫియర్

జిల్లాలో జ్వరాల విజృంభణ

- ఏలూరు ప్రభుత్వాస్పత్రికి జ్వర పీడితుల తాకిడి
- డెంగీతో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- పట్టని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : జిల్లాలో రోజురోజుకూ డెంగీ జ్వరాలు, వైరల్ ఫీవర్లు పెరిగిపోతున్నాయి. కొంత మంది ప్రాణాలు గాలిలోకి కలిసిపోతున్నాయి. అయినా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడే నీటి నిల్వలు ఏర్పడి దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. వాటి నిర్మూలనకు తగిన చర్యలు చేపట్టకపోవడంతో పర్యావసానంగా ప్రజలు జ్వరాల బారినపడి ప్రతి ఇల్లు మూలుగుతోంది. ఏలూరులోని పత్తేబాదు, చింతలపూడిలోని శివాపురం, రాఘవాపురం, దెందులూరు మండలం వేగవరం, గొల్లగూడెం, లింగపాలెం మండలం మఠంగూడెం, చాట్రాయిమండలం చీపురుగూడెం, బుట్టాయిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం మండలం, పెదపాడు, పెదవేగి, ఏజెన్సీ మండలాల్లో ప్రస్తుతం జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. ఏలూరు ప్రభుత్వాస్పతిలోని ట్రామాకేర్ విభాగంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగిని ఇటీవల డెంగీకి గురై మృత్యువాత పడింది. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన ఒక అపార్టుమెంటు వాచ్‌మెన్ (40) డెంగీ గురై మృత్యువాత పడ్డాడు. ఆస్పత్రికి వెళ్లితే కేవలం ఓపీగానే వైద్య సేవలు అందించి వైద్యులు చేతులు దులిపేసుకుంటున్నారు. ఇన్‌పేషెంట్‌గా చేర్చుకోకపోవడంతో జ్వరాల బారినపడేవారి లెక్కలు తప్పుతున్నాయి. ఇన్‌పేషెంట్‌గా చేరితే లెక్కల్లోకి వచ్చే ఔట్ పేషెంట్‌గా ఉండడంతో రోజువారీ ఓపీ మామూలే అన్నట్టుగా అధికారులు పట్టించుకోవడం లేదు. వాస్తవానికి జిల్లాలో ప్రతి రోజు 1000 మంది వరకు వివిధ ఆస్పత్రులకు వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఒక్క ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో రోజుకు 100 మంది వరకు ఓపీ విభాగాలకు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. జూలైలో 38 మంది ఏలూరు ప్రభుత్వాస్పత్రికి టైఫాయిడ్‌కు గురైన వారు రాగా మలేరియా జ్వర పీడితులు ఐదుగురు వచ్చారు. డెంగీ జ్వరాలు 56 మందికి వచ్చాయి. ఆగస్టులో టైఫాయిడ్ ఇప్పటి వరకు 45 మందికి రాగా, మలేరియా ముగ్గురికి వచ్చింది. మిగిలిన జ్వరాలు అన్నీ వైరల్ ఫీవర్లేనంటూ వైద్యులు వైద్య సేవలు అందిస్తూ సరిపుచ్చుకుంటున్నారు.

అధికారులకు నచ్చని పదం డెంగీ

ఠాగూర్ సినిమాలో హీరో చిరంజీవికి నాకు నచ్చని ఒకేఒక్క పదం సారీ అనేది అని అంటారు. ఇప్పుడు జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు నచ్చని పదం డెంగీ.. జ్వరం. ఏ జ్వరమైనా చెప్పవచ్చుకాని డెంగీ అనే పదాన్ని ఎవరైనా వైద్యులు కాని, ల్యాబ్ టెస్టులు చేసిన వారు కాని చెప్పారంటే వారి ఆగ్రహానికి గురి కావాల్సిందే. దీంతో జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు డెంగీ అనే పదాన్ని పలకడానికి భయభ్రాంతులకు గురవుతున్నట్టు తెలుస్తోంది. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో రక్త నమూనాలను ఎలీజా టెస్ట్ ద్వారా డెంగీని నిర్ధారణ చేయడానికి అవసరమైన మిషనరీలు ఉన్నాయి. కానీ ఈ పరీక్షలు తూతూ మంత్రంగానే అధికారులు చేస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో ఏ ప్రాంతంలో అయినా అధికంగా జ్వరాలు వస్తే అక్కడ టైఫాయిడ్, మలేరియాపరీక్షలతో పాటు డెంగీ పరీక్షలు కూడా ఆ ప్రాంత జ్వర బాధితులకు చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో ఎక్కడా ఈ విధానం జరగడం లేదు. జూలైలో ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఎలీజా పరీక్షలు 259 మందికి నిర్వహించగా 56 మందికి డెంగీ పాజిటివ్‌గా తేలింది. ఆగస్టులో ఇప్పటి వరకూ 40 మందికి డెంగీ అని నిర్ధారణ అయింది. ఇది కేవలం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చిన నమూనాలు మాత్రమే ఇక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్ళే వారి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏలూరులోని మూడు ఆస్పత్రులకు డెంగీ చికిత్స కోసం వెళ్తున్నారు. అక్కడ ఈ బాధితులు ఎక్కువగా ఉన్నారు. ఆ ఆస్పత్రులకు బ్రాంచ్‌లు విజయవాడలో ఉండడంతో మెరుగైన వైద్యం పేరుతో రిఫర్ చేస్తున్నారు. బాధితులు లక్షలాది రూపాయలను ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోంది. రక్తంలోని ప్లేట్‌లెట్స్ గంట గంటకు తగ్గిపోవడంతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు వస్తు న్నాయి. ఈ నేపథ్యంలో జ్వర బారిన పడితే ఇక వేలాది రూపాయలు ఆస్పత్రులకు కట్టాల్సిం దనే పరిస్థితులు జిల్లాలో కనిపిస్తున్నాయి. ప్రభుత్వాధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో చాపకింద నీరులా డెంగీ వ్యాప్తి చెందుతోంది. అయితే డెంగీ జ్వరంపై మాట్లాడడానికి వైద్యులెవ్వరూ కూడా సుముఖత చూపడం లేదంటే వైద్య శాఖాధికారులు ఏ రకమైన హెచ్చరికలు జారీ చేసి ఉంటారో అర్థం చేసుకోవచ్చు.

తగిన జాగ్రత్తలు తీసుకోండి..



వైరల్ ఫీవర్లు ఎక్కువగా ఉన్నాయి. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి వద్ద నిల్వ నీరు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమ కాటుకు గురికాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం వస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. సాధారణంగా వైరల్ ఫీవర్లు వారం నుంచి 10 రోజుల వరకూ ఉంటున్నాయి. ఎలాంటి భయం అవసరం లేదు. ఎక్కువగా జ్యూస్‌లు, ద్రవ పదార్థాలు తీసుకోవాలి. వీలైనంత వరకూ బయటి పదార్థాలను తినకూడదు. నాన్ వెజ్‌కు దూరంగా ఉండ డం ఎంతో మంచిది. జ్వరం బాగా వచ్చినప్పుడు తడిగుడ్డతో శరీరాన్ని తుడవాలి. వైద్యుల సలహా లేకుండా మందులను వేసుకోకూడదు. ప్రాణాలకే ప్రమాదం వచ్చే పరిస్థితులు ఏర్పడతాయి. 24 గంటలు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి.

– డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, చీఫ్ ఫిజీషియన్, ప్రభుత్వాసుపత్రి, ఏలూరు

నరకం చూపిస్తున్న దోమలు



దోమలు కుట్టకుండా జట్ కాయిల్‌ను వెలిగించుకుని వైద్యం చేస్తున్న డాక్టర్ దుర్గా కుమార్

దోమల కాటుతో జ్వరాలు పెరిగిపోతున్నాయి. జ్వర బాధితులు ఆస్పత్రులకు వస్తున్నా రు. ఏలూరు ప్రభుత్వా స్పత్రికి వచ్చే రోగులు, వార్డుల్లో చికిత్స పొందే రోగు లు దోమల బారిన పడుతు న్నారు. ఆస్పత్రి ఆవరణలో ఉండా లంటేనే దోమలు నరకం చూపిస్తు న్నాయి. దీంతో రోగి బంధువులు తాము కూర్చున్న ప్రదేశంలోనే దోమల నివారణ కోసం అగరబత్తీలను, జట్ క్వాయిల్స్‌ను పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక్క రోగులు, రోగుల బంధువులే కాదు సాక్షాత్తు ఆస్పత్రిలో వైద్య సేవలు చేసే వైద్యులు కూడా తమ కాళ్ళ వద్దో తమ పక్కనో ఇలాంటి దోమల మందులు పెట్టుకుని దోమల బారిన పడకుండా వైద్య సేవలు అందిస్తు న్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చీమలు, దోమలు, బల్లులు, కుక్కలు, పందులు, పశువులు, ఎలుకలు రాకుండా నివారించడానికి థర్డ్‌పార్టీ కాంట్రాక్టుగా లక్షలాది రూపాయలను ప్రతి నెలా చెల్లిస్తున్నారు. ప్రతి రోజు డ్రెయిన్లలో దోమల నివారణ కోసం మందులను పిచికారీ చేయాలి. వార్డులలో పిచికారీ చేయాలి. చీకటి పడిన తర్వాత ఫాగింగ్ చేయాలి. కానీ ఇవేమీ ఆస్పత్రిలో ఎక్కడా కనిపించవు. కానీ నెల అయ్యేటప్పటికి కాంట్రాక్టర్‌కు ఆస్పత్రి అధికారులు బిల్లులు పాస్ అయ్యేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తారు. ప్రజలు మాత్రం దోమల బారినపడి నరకంలోనే వైద్యం పొందాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆస్పత్రి ఆవరణలోని పట్టపగలు యథేచ్ఛగా అన్ని విభాగాల సమీపంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అయినా పట్టించుకునే వారు ఎవ్వరు లేరు. అనారోగ్యానికి గురైన వారు వైద్యం పొందడానికి ఆస్పత్రికి వస్తే ఈ దోమపోటుతో మరో వ్యాధి బారినపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. డెంగీ ఎక్కువగా ఉన్న తరుణంలో నగర నడిబొడ్డులో ఉన్న ప్రభుత్వాస్పత్రి ఆవరణలో పందులు తిరుగుతున్నా ఏ అధికారి పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకుని ఆస్పత్రిలో దోమల నివారణ కోసం ప్రతి రోజు ఫాగింగ్ చేయాలని రోగులు కోరుతున్నారు.



ఏలూరు ప్రభుత్వాస్పత్రిలోని తల్లీబిడ్డల విభాగం వద్ద పందుల స్వైరవిహారం

సూర్యుని చుట్టూ సుందర వలయం

ద్వారకాతిరుమలలో కనువిందు చేసిన సన్ హాలో



ద్వారకాతిరుమల, ఆగస్టు 17: ద్వారకా తిరుమల వెంకన్న క్షేత్రంలో శనివారం ఉదయం సూర్యుడు చుట్టూ సప్తవర్ణ శోభితమైన సుందరవలయం ఏర్పడి కనువిందు చేసింది. 11 గంటల ప్రాంతంలో ఏర్పడి దాదాపు గంటన్నర సేపు ఈ ఇంద్రధనస్సు (సన్ హాలో) చూపరులకు ఆనందాన్ని పంచింది. ఇలా సూర్యుడి చుట్టూ వలయం ఏర్పడటాన్ని సన్ హాలో లేదా 22 డిగ్రీ హాలో అని పిలుస్తారు. వాతావరణంలో ఉండే లక్షలాది షడ్భుజాకారపు మంచు స్ఫటికాల గుండా కాంతి ప్రయాణించి నప్పుడు వక్రీభవన చెందడం వల్ల ఈ వలయాలు ఏర్పడతాయి.వాడుకలో ప్రజలు వరదగూడు అని పిలుచుకుంటారు. ఈ హాలోలు సూర్యునికి మాత్రమే కాదు. రాత్రివేళల్లో జాబిల్లికీ ఏర్పడుతుంటాయి.



రీజనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఈవో సత్యనారాయణరాజు

భీమవరంలో కెనరా బ్యాంకు రీజనల్ కార్యాలయం

భీమవరం టౌన్, ఆగస్టు 17 : భీమవరం జువ్వలపాలెం రోడ్డులోని నూతనంగా నిర్మించిన కెనరా బ్యాంకు రీజనల్ కార్యాలయాన్ని శనివారం కెనరా బ్యాంకు సీఈవో, ఎండీ కె.సత్యనారాయణరాజు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న తమ ఖాతాదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజమండ్రిలో ఉండే రీజనల్ కార్యాలయాన్ని భీమవరానికి మార్చామని సీఈవో తెలిపారు. ఖాతాదారుల సొమ్ము భద్రత కోసం సైబర్ క్రైం బారిన పడకుండా కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామని, ఇప్పటికే 90 శాతం మంచి ఫలితాలు సాధించామని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా విద్యవైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గత ఏడాది ఈ కార్యక్రమాలకు రూ.60 కోట్లు వెచ్చించగా ఈసారి రూ.70 కోట్లు ఖర్చు చెయ్యాలని నిర్ణయించామన్నారు. భీమవరం రీజనల్ మేనేజర్ తోట రవిచంద్ర, విజయవాడ జీఎం రవి వర్మ, డీజీఎంలు విజయలక్ష్మి, మంజునాథ్, మేనేజర్లు జగదీష్, మరిడేశ్వరరావు, శ్రీనివాసన్, బిమ్మయ సమాల్, రామానాయక్, టీడీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, తోట జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు మార్గనిర్దేశకాలు జారీ

భీమవరం ఎడ్యుకేషన్,ఆగస్టు 17 :గురుపూజోత్సవం పురస్కరించుకొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల నామినేషన్ కోసం మార్గనిర్దేశాలు, సూచలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సూచనలను అనుసరించి ఆగస్టు 24 తేదీ లోపుగా సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు నామినేషన్లు సమర్పించాలని తెలిపారు.

ఉత్తమ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 17 : ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో విద్య, విజ్ఞాన బోధనతో పాటు, కళ, క్రీడా రంగాల్లో విద్యార్థులను తీర్చి దిద్దుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులను 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2024'లతో సత్కరించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన 'సర్వేజనా సుఖినోభవంతు' సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నారాయణ మాస్టారు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి ఈనెల 8న హైదరాబాద్‌లో పురస్కారాలను అందజేస్తారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలు, టీచర్లు, అధ్యాపకులు తమ విద్యార్హతలు, బోధనానుభవం తదితర పూర్తి వివరాలు గల సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్‌ల ఫోటోస్టాట్ కాపీలు, 4 పాస్‌పోర్టుసైజు ఫోటోలను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 31లోగా 'సర్వేజనా సుఖినోభవంతు,డోర్ నెం : 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15' చిరు నామాకు పంపాలని కోరారు.వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కోర్టులలో సెప్టెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ తెలిపారు. ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. పురుషోత్తమ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ వివాద కేసులు, పిటీషన్‌లను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. ఏలూరు బార్ అసోసి యేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామ్, 8వ అదనపు జిల్లా జడ్జి సునీల్‌కుమార్, ఫోక్సో స్పెషల్ కోర్టు జడ్జి ఉమాసునంద, బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, జనరల్ సెక్రటరీ చింతమనేని రమేష్, కల్చరల్ సెక్రటరీ తిగిరిపల్లి సుబ్బారావు, బార్ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతికశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

యువతకు ఆదర్శం అథ్లెట్ జ్యోతికశ్రీ

తణుకు, ఆగస్టు 17: ఒలింపిక్స్‌లో రాష్ట్రం తరపున పాల్గొన్న అథ్లెట్ జ్యోతికశ్రీ భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో జ్యోతికశ్రీని సత్కరించారు. సాధారణ కుటుంబంలో పుట్టి కష్టపడి అంచెలంచెలుగా ఎన్నో విజయాలను సాధించి ఒలింపిక్స్ స్థాయికి వెళ్లడం అభినందనీయమని, యువత జ్యోతికను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

ఊరూ వాడా బదిలీలు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- తాజాగా పచ్చ జెండా ఊపిన ప్రభుత్వం
- ఐదేళ్లు దాటితే ఉన్న చోటు నుంచి కదలాల్సిందే
- 15 శాఖలకే బదిలీల్లో స్థానం
- టీచర్లు, వైద్య సిబ్బందికి బదిలీలు నో
- 19 నుంచి 31 లోపే ఈ ప్రక్రియ ముగింపు
- ఈసారి కూడా పాత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లానే ప్రాతిపదిక

ఎన్నాళ్లకెన్నాళ్లకు.. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల సందడి సోమవారం నుంచి ఆరంభం కాబోతుంది. ప్రజా సంబంధపరమైన శాఖలకు మాత్రమే ఈసారి బదిలీలు వర్తింపజేశారు. ఉపాధ్యాయులు, వైద్య విభాగాల్లో పని చేస్తున్న వారిని ఈ ప్రక్రియ నుంచి ఈసారి మినహాయించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బందిని కూడా ఈసారి పెద్ద ఎత్తున స్థాన చలనం కలిగించబోతున్నారు. విశేషమేమిటంటే పాత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికనే ఈసారి కూడా బదిలీలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈప్రక్రియ ఈనెల 19 నుంచి ఆరంభమై 31 నాటితో ముగియనుంది. ఆ తదుపరి వెంటనే బదిలీలపై తిరిగి నిషేధం అమలులోకి వస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన మార్గదర్శక సూత్రాలను శనివారం ప్రభుత్వం విడుదల చేసింది. పెద్ద ఎత్తున బదిలీలకు అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇప్పుడు ఆయా నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు సైతం తొలిసారి తమ పవర్ చూపించ డానికి కొంత వెసులుబాటు వచ్చింది. ఎవరైతే ఐదేళ్లపాటు ఒకే ప్రాంతంలో ఇప్పటివరకు కొనసాగి ఉంటారో వారందరినీ విధిగా బదిలీ చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించింది. ఎలాగూ రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లను అనుమతించారు. బదిలీల్లో పూర్తి పారదర్శక పాటిస్తామని ప్రకటించింది. వాస్తవానికి గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పాలనా వ్యవహారాల్లో ఇష్టానుసారంగా వ్యవహరించింది. జిల్లాలను నేరుగానే విభజించింది. ఉమ్మడి జిల్లాలు చెదిరిపోయాయి. అప్పట్లో సర్దుబాటు పేరిట సీనియర్లందరినీ కొత్త జిల్లాలకు, జూనియర్లందరిని పాత ప్రాంతంలోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకుని అమలు చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున సిఫార్సులు చేశారు. అంతకంటే మించి తమకు నచ్చని వారిని సుదూర ప్రాంతాలకు పంపించారు. ఇలాంటి క్రమంలోనే జగన్ పాలనలో ఏర్పడిన గ్రామ సచివాలయాల్లోను పెద్దఎత్తున సిబ్బందిని నియమించారు. ఇప్పుడు వీరంతా దాదాపు ఐదేళ్లపాటు పదవీ కాలం పూర్తి చేసుకున్నట్టయ్యింది. వీరిలో అత్యధికులను ఎక్కడికక్కడ స్థాన చలనం చేయబోతున్నారు.

ఏఏ శాఖల్లో బదిలీలు ?

సాధారణంగా ప్రభుత్వపరంగా ఉద్యోగులందరినీ బదిలీ చేయకుండా కేవలం ప్రజాసంబంధ వ్యవహారాల్లో నిత్యం మునిగితేలే శాఖలనే బదిలీలకు కూటమి ప్రభుత్వం ఎంచుకుంది. ప్రత్యేకించి పోలీస్, రెవెన్యూ, కమర్షియల్ టాక్స్, పంచాయతీరాజ్, గ్రామ, వార్డు సచివాలయాలు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్‌లు, అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లో కలిపి దాదాపు 15 శాఖల్లో మాత్రమే బదిలీలు చేయాలని న్ణియించారు. ప్రత్యేకించి పోలీస్ శాఖలో ఎస్ఐ, సీఐ, డీఎస్పీతో పాటు ఉన్నతాధికారులందరినీ ప్రభుత్వం పరిపాలనాపరమైన ఆమోదంతో ఎప్పటికప్పుడు బదిలీలు చేస్తూ వచ్చింది. అయితే పోలీస్‌శాఖలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లల్లో తమ అవసరాల రీత్యా జిల్లా ఎస్పీలకు తమ కష్టాలను విన్నవించుకుని బదిలీలు చేయించుకునేవారు. ఇప్పుడు తాజా ఉత్తర్వుల ప్రకారం వీరికి కూడా బదిలీలు వర్తిస్తాయి. ఇక రెవెన్యూకు సంబంధించి అత్యధికులు రాజకీయ పరమైన సిఫార్సులతోనే తమకు నచ్చిన ప్రాంతాల్లో ఎక్కువ కాలం కొనసాగుతూ వచ్చారు. ఇలాంటి వారిని ఈసారి బదిలీ చేస్తారు. ఇప్పటికే ఎంపీడీవో, తహసీల్దార్‌ల బదిలీ ప్రక్రియ దాదాపు పూర్తయినందున ఇక దిగువస్థాయి అధికారులు, సిబ్బందిపైనే బాణం ఎక్కుపెట్టారు. కమర్షియల్ టాక్స్ రిజిస్ట్రేషన్ వంటి శాఖలు ప్రభుత్వ ఆదాయ ఆర్జిత శాఖలు కావడంతో వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రిజిస్ట్రార్‌లు, సబ్ రిజిస్ట్రార్‌లతో పాటు ఆ శాఖలో వివిధ కేటగిరీల్లో పని చేస్తున్న ఉద్యో గులను ఇప్పటికే బదిలీ చేసి చాలాకాలమైంది. కొందరైతే తమకు నచ్చిన స్థానాల్లో ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పనిచేస్తూ వస్తూ ఎక్కడికక్కడ అవినీతికి పాల్పడ్డారు. ఇంకొందరు తమకునచ్చిన పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఈ రెండు శాఖల్లోను పెద్ద ఎత్తున ప్రక్షాళన జరిగే అవకాశం లేకపోలేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్సైజ్ శాఖను దాదాపు నిర్వీర్యం చేశారు. ఉన్నత స్థాయి అధికారులకు కూడా పని లేకుండా చేశారు. త్వరలోనే ఎక్సైజ్ కొత్త పాలసీ తీసుకురానున్న నేపథ్యంలో అంతకు ముందే ఈశాఖను గాడిన పెట్టాలని నిర్ణయించి ఆ శాఖను బదిలీ జాబితాలోకి చేర్చారు.

గ్రామ,వార్డు సచివాలయాల్లోను కదలిక

గత ప్రభుత్వ మానస పుత్రిక గ్రామ వార్డు సచివాలయాలు. ప్రత్యక్షంగా ఎన్నికైన ఎంపీపీ, జడ్పీటీసీ, గ్రామ సర్పంచ్‌లను పక్కకు నెట్టేసి గ్రామ వార్డు సచివాలయాలను అమలులోకి తెచ్చింది. వీటిలో వివిధ విభాగాలకు చెందిన వారిని ఎంపిక చేశారు. ఆ క్రమంలోనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సచివాల యాల్లో దాదాపు 11 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో సగానికి సగం మందిని ఈసారి స్థాన చలనం చేసే అవకాశం ఉంది. ఈ శాఖల్లో పనిచేస్తూనే ఇంకోవైపు అప్పట్లో అధికార వైసీపీకి బాజా మోగించారు. ప్రభుత్వం అంటే మేమేనంటూ అలజడి చేశారు. ఇలాంటి వారందరినీ గడిచిన కొన్నినెలల క్రితం శాశ్వత ఉద్యోగులుగా నియమించారు. ఇప్పుడు వీరిలో అత్యధికులను బదిలీ చేయనుండడం సరికొత్త విశేషం.

ఎమ్మెల్యేలకు ఒక అవకాశం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటిన తర్వాత తొలిసారిగా ఉద్యోగుల బదిలీలకు అనుకూలంగా ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఈ నేపథ్యంలో కొత్త ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తారస్థాయిలో జరగాలని ఆకాంక్షిస్తున్నారు. ఇప్పటికే వైసీపీకి అంటకాగిన అధికారులు, సిబ్బంది అనేక మంది తమకళ్ళెదుటే ఉండడం వీరికి మింగుడు పడడంలేదు. నియోజక వర్గాల్లో తమకంటూ కొత్తటీమ్‌లను ఏర్పాటు చేసుకోవడానికి ఈ బదిలీ ప్రక్రియ కొత్త ఎమ్మెల్యేలకు వరంగా మారింది. సాధ్యమైనంత మేర ఇంజనీరింగ్ విభాగాలు, గ్రామ వార్డు సచివాలయాలు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, పోలీస్ విభాగాలన్నింటిలోను అత్యధికులు రాజకీయ సిఫార్సులు కోరుకునేవారే. అందుకనే ఎమ్మెల్యేలు తమ అనుకూలురుకే ఎక్కువ ఛాన్స్ ఇవ్వబోతున్నారని ఇప్పటికే ప్రచారం. ఏది ఏమైనా సోమవారం నుంచి బదిలీల ప్రక్రియ ఆరంభమై ఈనెల 31వ తేదీన ముగియనుంది.ఈసారి కూడా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికనే బదిలీలు జరగబోతున్నాయి. ఈ ప్రక్రియకు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు.

దేశం గర్వించే రీతిలో విద్యార్థులు ఎదగాలి

ఐఐటీ అల్యుమ్ని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ

ఏపీ నిట్‌లో ఘనంగా స్నాతకోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 17: దేశం గర్వించే రీతిలో విద్యార్థులు వినూత్న పరిశోధనలు , ఆవిష్కరణలు చేపట్టాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్, ఐఐటీ అల్యుమ్ని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ అన్నారు. ఏపీ నిట్‌లో 6వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు.రవిశర్మ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్తకొత్త సాంకేతికతలు ఆవిష్కృతం అవుతున్నాయని వాటిలో మెలుకువలు నేర్చుకుని పట్టు సాధించిన వారు అగ్రస్థానాల్లో నిలుస్తారన్నారు. విద్యార్థులు సరైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ పరిశోధన, అభివృద్ధికి పెద్ద పీట వేసినప్పుడే ప్రగతి పథంలో పయనించేందుకు వీలుంటుందన్నారు. నిట్‌లో ప్రయోగశాల, పరిశోధన పరికరాల సేకరణ, మౌలిక సదుపాయాల నిమిత్తం కేంద్రం రూ.754 కోట్లు మంజూరు చేయనుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు కొత్త పాఠ్యాంశాలను అందుబాటులో తీసుకురానున్నామన్నారు. తొలుత 2020-24 విద్యాసంవత్సరంలో బీటెక్ పూర్తి చేసుకున్న 527 మంది విద్యార్థులకు, ఎంటెక్ పూర్తిచేసిన 15 మంది విద్యార్థులకు డిగ్రీలు, 25 మంది పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలు అందజేశారు.

బంగారు పతకాల విజేతలు

బయో టెక్నాలజీలో రామిరెడ్డి వెంకటసాయిరెడ్డి 9.62 గ్రేడ్ పాయింట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో మంకాల కార్తిక్ 9.44, సివిల్‌లో గుబ్బల హారిక 9.12, కంప్యూటర్ సైన్స్‌లో సలాడి వెంకట శశిభూషణ్ 9.83, ఈఈఈలో రెడ్డి వీర వెంకటసాయికృష్ణ అనిల్ 9.27, మెకానికల్‌లో మంత్రిప్రగడ సాయి అఖిల్ 9.56, మెటలార్జికల్ ఇంజనీరింగ్‌లో గంటా మోహిత్ యాదవ్ 8.83 లతో పాటు 2020-24 అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన వెంకట శశిభూషణ్‌కు ఇనిస్టిట్యూట్ తరపున బంగారు పతకాలను అందజేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ ఆర్‌కే శాస్త్రి, డాక్టర్ టీ.కురుమయ్య, డాక్టర్ వీరేష్‌కుమార్, డాక్టర్ ఎన్.జయరాం, డాక్టర్ కార్తిక్ శేషాద్రి, అసోసియేట్ డీన్ డాక్టర్ సందీప్, సెనెట్ సభ్యులు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ముఖ్య అతిథి డాక్టర్ రవిశర్మ, ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి

శాస్త్రవేత్తగా రాణించాలి : వెంకట శశిభూషణ్



నాన్న సుబ్బారావు ప్రైవేటు ఉద్యోగి. అమ్మ గృహిణి. మాది తణుకు.కంప్యూటర్ సైన్స్‌లో 9.83 గ్రేడు పాయింట్లు సాధించి ఇన్‌స్టిట్యూట్ టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం హైదారాబాద్‌లోని పేపాల్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాను.శాస్త్రవేత్తగా రాణించాలనేది నా లక్ష్యం.

ఇంజనీర్‌గా స్థిరపడాలి : గుబ్బల హారిక



నాన్న శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అమ్మ కనకలత జూనియర్ ఇంజనీర్. మాది రామచంద్రపురం. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 9.12 గ్రేడు పాయింట్లు సాధించడం ఆనందంగా ఉంది. ఈఎస్‌సీ సర్వీసెస్‌లో ఇంజనీర్‌గా స్థిరపడాలనేది నా ఆశయం

నా కల సాకారమైంది : మంత్రిప్రగడ సాయి అఖిల్



నాన్న శ్రీనివాసరావు సీనియర్ ఎకౌంట్ మేనేజర్. అమ్మ సూర్యకుమారి గృహిణి. మాది విజయవాడ. మెకానికల్‌లో 9.56 పాయింట్లు సాధించాను. ప్రస్తుతం నేను క్యాట్ విజన్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. వార్షిక వేతనం రూ7.5 లక్షలు అందుకుంటున్నాను. నాకల సాకారమైనందుకు సంతృప్తిగా ఉంది.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి : టంకాల దీప్తి సాయి



నాన్న గుప్తా వ్యాపారవేత్త. అమ్మ జయలక్ష్మి గృహిణి. మాది శ్రీకాకుళం. ఈఈఈలో 9.09 గ్రేడు పాయింట్లు సాధించడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం ఎల్‌అండ్‌టీ కంపెనీలో గ్యాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీగా చేస్తు న్నాను. వార్షిక వేతనం రూ 6.5 లక్షలు. నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటే ఏరంగంలోనైనా రాణించవచ్చు.

ఆఫీస్ బేరర్లకు వెసులుబాటుపై జర జాగ్రత్త !

ఉద్యోగుల సాధారణ బదిలీల మార్గదర్శకాలపై ఏపీఎన్జీవోల సంఘ నాయకుల వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 17 : ఉద్యోగుల సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం మార్గదర్శకాలు, షెడ్యూలు విడుదల చేయడంపై ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ అధ్యక్ష, కార్య దర్శులు సీహెచ్ శ్రీనివాస్, ఎస్.రామారావు హర్షం వ్యక్తం చేశారు. బదిలీలను జిల్లా అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే చేయాలని కోరారు. బదిలీల నుంచి ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు వున్న మినహాయింపు,వెసులుబాట్లపై ఉన్నతాధికారులు నిశిత పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల బైలాస్‌ను బట్టి రాష్ట్ర, జిల్లా, తాలూకా శాఖల ఆఫీస్ బేరర్లకు సంఘ నియమ నిబంధనల మేరకు కనిష్టంగా 6 సంవత్సరాలు, గరిష్ఠంగా 9 సంవత్సరాల పాటు మినహాయింపులుంటాయని, మూడు దఫాలు వినియోగించుకునేందుకు వీలుండే ఈ నిబంధనను అమలు చేసే టపుడు జిల్లా అధికారులు నిశిత పరిశీలన జరపాలని కోరారు. రికగ్నిషన్ ఆఫ్ సర్వీస్ అసోసియేషన్స్ (రోసా) నియమావళినే ప్రామాణికంగా తీసుకుని ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు బదిలీల నుంచి మినహాయింపునివ్వాలని, ముఖ్యంగా కొన్ని సంఘాలు ఆఫీస్ బేరర్లకు జారీచేసే లేఖల వాస్తవికతపై సమగ్ర పరిశీలన జరిపిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కొన్ని సంఘాలు జారీచేసిన ఆఫీస్ బేరర్ల లేఖలు, మినహాయింపులపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని, ఇప్పటికైనా ఆ విచారణ నివేదికను బహిర్గతం చేసి తగిన చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో ఏపీఎన్జీవోల సంఘానికి మూడంచెల కార్యవర్గాలు రాష్ట్రజిల్లా, తాలూకా స్థాయిల్లో ఉన్నాయని, ఆ మేరకు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన ఎన్నికలు, ఎన్నికైన కార్యవర్గం ఆఫీస్ బేరర్ల జాబితా, ఏటా ఆడిట్ నివేదికలు పారదర్శకంగా ప్రభుత్వానికి, సంబంధిత ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 తాలూకాల శాఖలున్నాయని వివరించారు. రాత్రికి రాత్రి పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చే ఆఫీస్ బేరర్ల జాబితాలు, లేఖలను పరిగణలోకి తీసుకోరాదన్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో ఇసుక స్టాక్ వివరాలు

భీమవరంటౌన్, ఆగస్టు 17 : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులు మర్రులో 5,603 టన్నులు, పెండ్యాలలో 1,04,076 టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రులో 37,602 టన్నులు, ఆయా స్టాక్ పాయింట్లు వద్ద టన్నుకు రూ.27 0 లకు ఉచిత ఇసుక లభిస్తుదని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వ రపురంలో 23,739 టన్నులు ఉందని టన్నుకి 265 రూపాయలు చెల్లించి పొందవచ్చు అని కలెక్టర్ తెలిపారు.

క్రైం కార్నర్

అప్పుల భయంతో వ్యాపారి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : ఒకవైపు ఆరోగ్య సమస్య, మరోవైపు ఆర్థిక పరిస్థితులతో తల్లడిల్లుతూ జీవితంపై విరక్తి చెందిన చిరు వ్యాపారి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయనగరం జిల్లాకు చెందిన బంకురి నాగేశ్వరరావు (45) కొంతకాలం క్రితం ఏలూరు వచ్చి రాణి నగర్‌లో ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అల్యూ మినియం సామాన్ల వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాడు. మరోవైపు అతనికి బ్రెయిన్ క్యాన్సర్ ఉంది. వైద్యానికి అప్పులు చేయడం, కుమార్తెలకు వివాహాలు ఎలా చేయాలా అని దిగులుతో ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం క్రైస్తవ సమాధుల తోటలోకి వెళ్ళి ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం ఏలూరు టూటౌన్ పోలీసులకు అందడంతో ఎస్ఐ మదీనా బాషా సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ భవన నిర్మాణ కార్మికుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి శనివారం మృతి చెందాడు. కృష్ణా జిల్లా నందివాడ మండలం వెన్ననపూడి గ్రామానికి చెందిన పిలిపే శిఖామణి (50) తాపీపనులు చేస్తూ ఉంటాడు. ఈనెల 16వ తేదీన లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలో పనికి వెళ్ళాడు. తిరిగి రాత్రి బయలుదేరి వెళ్తుండగా 10 గంటల సమయంలో ఏలూరు బైపాస్ వంగూరు వద్ద బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం అతని మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. అతడిని 108లో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

టీ తాగుతూ కుప్పకూలి ఒకరి మృతి

ఏలూరు క్రైం,ఆగస్టు 17 :ఒక హోటల్ వద్ద టీ తాగుతున్న వ్యక్తి అకస్మాత్తుగా అక్కడే కూలబడి మృతి చెందాడు. ముసునూరు మండలం గోపవరానికి చెందిన గొర్రిముచ్చు శేషు (40)కు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి.ఆమె ప్రసవం కోసం నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆమెకు రక్తం అవసరం ఉందని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి తీసుకురావాలని అక్కడ వైద్యులు సూచించారు. శనివారం సాయంత్రం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. ఆసుపత్రి గేటు పక్కనే ఉన్న హోటల్ వద్దకు వెళ్ళి టీ తాగుతూ నెమ్మదిగా కింద కూర్చుండిపోయాడు. పరిస్థితి గమనించిన వారు అక్కడి వారు ఆసుపత్రి సిబ్బందికి చెప్పడంతో అక్కడికి వచ్చి అత్యవసర విభాగానికి తీసుకు వెళ్ళారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని డాక్టర్ జ్యోతి నిర్ధారించారు. అతని వద్ద బ్లడ్ శాంపిల్ స్లిప్‌పై ఫోన్ నెంబర్ ఉండడంతో అతని బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని అప్పగించారు. గుండెపోటు వల్లే మరణించాడని నిర్ధారణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి

ద్వారకాతిరుమల, ఆగస్టు 17: లారీ అదుపుతప్పి పక్కనున్న కల్వర్టులోకి వెళ్లి తిరగబడటంతో అందులో ఇరుక్కున్న డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని ఎం.నాగులపల్లి శివారులో శనివారం జరిగింది. స్టేషన్ రైటర్ దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం దెందులూరు మండలం సోమవరప్పాడులోని బాలాజీ ఇండ్రస్ట్రీలో పని చేస్తున్న ఒడిశాకు చెందిన పటిడి కులేసిక (28) శనివారం సాయంత్రం కాంక్రీట్ మిక్సర్ లోడుతో మండలంలోని పి.కన్నాపురంలో ఉన్న కోకోకోలా ఫ్యాక్టరీకి వెళ్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కల్వర్టులోకి దూసుకెళ్లింది. లారీ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ అక్కడకక్కడే మృతి చెందాడు. బాలాజీ ఇండస్ట్రీస్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్య



కాళ్ళ ఆగస్టు 17 : ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి ఉరి వేసుకుని మృతి చెందినట్టు కాళ్ళ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఉండి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నందీశ్వరరావు (53) కాళ్ళ మండలం పెదఅమిరం పరిధిలోని మెహర్ బాబా స్కూల్ వెనుకవైపు చెట్టుకి ఉరి వేసుకుని చనిపోయినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం అందుకున్న కాళ్ళ పోలీస్ సిబ్బంది మృతదేహానికి కిందికి దింపి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పెనుగొండ మండలం ములపర్రు గ్రామానికి చెందిన నందీశ్వరరావు ఇటీవల వీఆర్వో నుంచి ప్రమోషన్ పొంది ఉండి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.మృతునికి భార్య, కుమారుడు,కుమార్తె ఉన్నారు. మృతుని భార్య రత్న కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వెంటాడిన దురదృష్టం

అమ్మకానికి పెట్టిన వాహనం దగ్ధం



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 17: జంగా రెడ్డిగూడెం మండలంలోని పుట్ల గట్ల గూడెం సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డులో గడ్డి లోడుతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం లోని వైర్లు షార్ట్ అయ్యి మంటలు చెలరేగి గడ్డితో పాటు వాహనం పూర్తిగా దగ్ధమైంది. పుట్లగట్లగూడెం గ్రామానికి జోనుబోయిన రమేష్ ఆరు నెలల క్రితం రూ.3 లక్షలతో కొనుగోలు చేసిన టాటా ఏస్ వాహనంలో టీ.నరసాపురం మండలం సింగరాయపాలెం గ్రామంలో ఎండు గడ్డి కొనుగోలు చేసి తీసుకువస్తుండగా పుట్లగట్ల గూడెం సమీ పానికి వచ్చేసరికి వైర్లు షార్ట్ అయ్యి మంటలు చెలరేగి గడ్డి అంటు కుంది. మంటలు అంటుకున్న విషయం తెలియక వాహనం నడుపు కుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహన దారుడు చెప్పడంతో రమేష్ వాహనాన్ని ఆపాడు. ఇంతలో మంటలు వాహనం ముందుకు ఉన్న రెండు డోర్లు వైపుకు వ్యాపించగా డోర్లు రెండూ స్టక్ అయ్యాయి. భయంతో డోర్‌ను కాలితో బలంగా తన్నడంతో డోరు తెరుచు కోవడంతో రమేష్ బయటకు వచ్చేయడంతో ప్రాణాపాయం తప్పింది. రమేష్ ఊపిరి పీల్చుకున్నాడు. జంగారెడ్డిగూడెం ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. కిరాయిలు లేక కొద్దిరోజుల అమ్మివేశానని రూ.20 వేలు అడ్వాన్సు తీసుకున్నానని సోమవారం వాహనం డెలివరీ ఇవ్వాల్సి ఉండగా ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

మాటలు కలిపి మద్యం తాగించి..

మద్యం మత్తులో మహిళపై అత్యాచారయత్నం

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : పొట్టకూటి కోసం నగరానికి వచ్చిన ఒక జంట హోటల్‌లో పని చేస్తున్నారు. అద్దె ఇల్లు దొరక్కపోవడంతో ఒక గుడి ఆవరణలో పడుకున్నారు. అర్ధరాత్రి ముగ్గురు యువకులు గుడి వద్దకు వచ్చి మద్యం మత్తులో మహిళపై అత్యాచారయత్నం చేయగా అడ్డు వచ్చిన ఆమెతో ఉన్న వ్యక్తిని కూడా కొట్టారు. దీంతో ఆమె కేకలు వేయడడంతో అటుగా వెళ్తున్న ఒక యువకుడు రావడంతో ముగ్గురు పారిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అత్యాచార కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లింగపాలెం మండలం ఒక గ్రామానికి చెందిన మహిళ (35)కు భర్త మరణించడంతో పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో సహజీవనం చేస్తోంది. పది రోజుల క్రితమే ఏలూరులోని ఒక హోటల్‌లో పనిచేసేందుకు వచ్చారు. అద్దె ఇంటికోసం వెతుకుతూ వన్‌టౌన్‌లోని ఒక గుడి ఆవరణలో రాత్రి తలదాచుకుంటున్నారు. ఈనెల 16 రాత్రి గుడి ఆవరణలో పడుకున్నారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ముగ్గురు యువకులు వచ్చి వారితో మాట కలిపారు. ఇల్లు అద్దెకు చూపిస్తామని తమ ఫోన్ నెంబర్ తీసుకోండి అంటూ నెంబర్ ఇచ్చారు. మద్యం తెచ్చామని తాగుతారా అంటూ వారికి మద్యం ఇచ్చారు. మద్యం మత్తులో ఆ ముగ్గురు మహిళపై అత్యాచార యత్నానికి ప్రయత్నించారు. ఆమె అడ్డగించడంతో ఆమెను కొట్టారు. అక్కడే ఉన్న ఆమె స్నేహితుడిని కొట్టారు. కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న యువకుడు మోటారు సైకిల్ ఆపి కేకలు వేయడంతో ఆ ముగ్గురు యువకులు పారిపోయారు. ఈ సమాచారం పోలీసులకు చెప్పడంతో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. ఆ ముగ్గురు యువ కులను పోలీసులు గుర్తించారు. వారు దొంగతనాల కేసుల్లో ఉన్న పాత నేరస్తులేనని గుర్తించారు. ఏలూరు టీచర్స్ కాలనీకి చెందిన నూతిపల్లి పవన్, లంబాడీ పేటకు చెందిన నారపాటి నాగేంద్రబాబు, గడ్డి విజయ్ కుమార్‌లుగా గుర్తించారు. ఆ ముగ్గురిపై అత్యాచారయత్నం, హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు వైద్యుల సేవలు అభినందనీయం


రక్త దానం శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, ఆగస్టు 17 : ఏజెన్సీలో ప్రైవేటు ఆస్పత్రు లు వైద్య సేవలు హర్షణీ యమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాల రాజు అన్నారు. కామయ్యపాలెం జెడ్పీ హైస్కూల్ వద్ద జంగారెడ్డిగూడెం మమత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురిని పరీక్షించి ఉచితంగా మందు లు అందజేశారు. తలసేమియా వ్యాధి గ్రస్తులకు కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన సిబ్బందిని అభినందించారు. అనంతరం పాఠశాల్లో మధ్యాహ్న భోజన మెనో పరిశీలించి ఎమ్మెల్యే రుచి చూశారు. కూటమి నాయకులు కరాటం సాయి, పసుపులేటి రాము, చాత్రాతి ప్రసాద్, గూడ పాటి అరుణ్, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు బి.అనిల్‌కుమార్, కె.మధు, గుడెల్లి లక్ష్మీనారాయణ, మమత ఆస్పత్రి వైద్యులు సిబ్బంది ఉన్నారు.

అన్న క్యాంటీన్‌కు దాతలు ముందుకు రావాలి


రూ.లక్ష చెక్కును అందజేస్తున్న దాత

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 17: అన్న క్యాంటీన్ నిర్వహణకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో నగరానికి చెందిన లచ్చిరెడ్డి రామారావు రూ.లక్ష ను అన్న క్యాంటీన్‌కు చెక్కు రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ పేదల ఆకలి బాధ తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మరలా ప్రారంభించిందన్నారు. చోడే వెంకటరత్నం, బీ.వెంకట్రావు, యడ్లపల్లి శివ, రెడ్డి నాగరాజు, కె.రాజు, శివప్రసాద్ పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలి


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ కావూరి

పెదపాడు, ఆగస్టు 17 : విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, చదువు ఒక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమని బీజేపీ నాయకులు, మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు అన్నారు. వట్లూరులోని బాలయోగి గురుకుల పాఠశాలకు రూ. రెండు లక్ష ల సొంత నిధులతో సమకూర్చిన వాటర్ ప్లాంట్‌ను విద్యార్థినుల సమక్షంలో కావూరి శనివారం ప్రారంభించారు. బీజేపీ నాయకులు కె.కృష్ణప్రసాద్, విక్రం కిషోర్, జి.శ్రీను, యు.వెంకట్రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీనియర్ స్వర్ణకారులకు సత్కారం

ఏలూరు రూరల్, ఆగస్టు 17: ఏలూరు పట్టణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్వాత ంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు పూర్తి అయ్యిన సందర్భంగా స్థానికంగా సీనియర్ స్వర్ణకారులను ఘనం గా సత్కరించి అభినందించా రు. సీనియర్ స్వర్ణ కారులు పి.వరహాలు, నారాయణరావు, భాస్కర్‌రావు, ఎల్‌వీ ప్రసాద్‌లను శాలు వాకప్పి ఘనంగా సత్కరించారు. ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాలు పంపిణీతో పాటు సీనియర్ స్వర్ణకారులను సత్కరించటం ఆనవాయితీగా వస్తోందని సంఘం అధ్యక్షులు పి.తిలక్ తెలిపారు. నాగ భూషణం, సాయికృష్ణ, ఆర్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : గాయాలతో రోడ్డుపై పడి ఉన్న ఒక వృద్ధుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భీమవరం వన్‌టౌన్ ప్రాంతంలో ఈనెల 13వ తేదీ రాత్రి 65 సంవత్సరాల వృద్ధుడు తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్నాడు. దీంతో అక్కడి పోలీసులు భీమవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. దీంతో ఏలూరులో చికిత్స పొందుతున్న అతను శనివారం మృతి చెందాడు.ఈ సంఘటనపై భీమవరం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 17 : స్థానిక బుట్టాయిగూడెం రోడ్డులో ఓ వ్యక్తికి చెందిన స్థలం ముందు ఆ పక్కనే ఆస్పత్రికి చెందిన వాటర్ ట్యాంకర్ పెట్టడంతో ఘర్షణ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పిండి రాము అనే వ్యక్తికి బుట్టాయిగూడెం రోడ్డులో ఇంటి స్థలం ఉంది. ఆ స్థలానికి ఆనుకుని పిల్లల ఆస్పత్రి ఉంది. పిల్లల ఆస్పత్రికి చెందిన వాటర్ ట్యాంకరును రాము స్థలం ముందు పెట్టారు. రాము ఆ ట్యాంకరును తీసేయమని శనివారం రాత్రి ఆస్పత్రి సిబ్బందికి చెప్పగా నరేష్ అనే వ్యక్తికి రాముతో వచ్చిన మరికొందరికి వాగ్వాదం జరిగింది. అది కాస్తా ఘర్షణగా మారి ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఆస్పత్రి ఎదుట 200 మందికి పైగా అరుపులు కేకలతో గొడవకు దిగగా జంగారెడ్డిగూడెం, లక్కవరం ఎస్సైలు జ్యోతిబసు, సుధీర్ బాబు, పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి ఇరు వర్గాలను చెదరగొట్టారు.

బాలిక కేసులో నిందితుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 17 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నాని చెప్పి మోసం చేసి ఆమెపై పలుమార్లు అత్యాచారం చేసిన ఓ గ్రామానికి చెందిన ముళ్ళపర్తి రాజేష్‌ను డీఎస్పీ యు.రవిచంద్ర శనివారం అరెస్టు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బాలిక మండలంలోని ఒక గ్రామంలో తన అమ్మమ్మ ఇంటి వద్ద తల్లితో కలిసి ఉంటుంది. అదే గ్రామానికి చెందిన రాజేష్ బాలికను ప్రేమిస్తున్నాని మాయ మాటలు చెప్పి లంబసింగి తీసుకువెళ్ళాడు. అక్కడ బాలికకు తాళిబొట్టు కట్టి ఇద్దరికీ పెళ్ళయ్యిందని చెబుతూ పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ యు.రవిచంద్ర దర్యాప్తు ప్రారంభించి బాలిక లంబసింగిలో ఉన్నట్లు గుర్తించి బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.ఈ కేసులో నిందితుడు రాజేష్ పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

కాపర్ వైరు చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, ఆగస్టు 17: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి కాపర్‌వైరు చోరీల పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి. దుర్గామహేశ్వరరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం మండలంలోని సీతంపేట,మక్కినవారిగూడెం, బంధంచర్ల, అల్లంచర్లరాజుపాలెం గ్రామాల్లో 6మంది రైతులకు సంబంధించిన వ్యవసాయ పొలాల్లో ఉన్న 6 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు గుర్తు తెలియని దొంగలు పగులగొట్టి వాటిలో కాపర్ వైరును చోరీ చేశారని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసు

నల్లజర్ల, ఆగస్టు 17 : నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో ఉన్న రాజేశ్వరి ఫాం హౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, నల్లజర్ల సీఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గుణ్ణం సురేష్ తన పుట్టిన రోజు వేడుకను శుక్రవారం రాత్రి ఫాం హౌస్‌లో ఘంటా యువరాజు సహాయంతో ఏర్పాటు చేశాడు. బంధుమిత్రులకు విందుతో పాటు వినోదం కల్పించేందుకు కిలపర్తి దుర్గా శ్రీనివాస్ అనే మధ్యవర్తి ద్వారా నలుగురు యువతలను తీసుకుని వచ్చి సినిమా పాటలకు డ్యాన్స్ వేయించాడు. ఆ ఫంక్షన్ హాజరైన కొందరు వీడియో తీసి గ్రూపుల్లో పెట్టడంతో శనివారం వైరల్ అయ్యింది. విచారణ చేపట్టగా నిర్వాహకులు సురేష్, యువరాజుపై చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు నల్లజర్ల సీఐ, దేవరపల్లి ఎస్ఐ తక్షణమే స్పందించి తమ సిబ్బందితో వెళ్లి సురేశ్, యువ రాజు, శ్రీనివాస్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. డ్యాన్సర్లను మండపేటకు చెందిన వారని తెలిపారు.

నల్లజర్లలో జరిగింది రేవ్ పార్టీ కాదు : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రేవ్ పార్టీ జరిగిందని, పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వస్తున్న వార్తలు అవాస్తవాలని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. వదంతులను సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా వ్యాప్తి చేస్తే కేసులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సోషల్ మీడియా పోస్టులపై ఇప్పటికే ప్రత్యేకంగా నిఘా ఉంచామన్నారు. సాధారణ జనజీవనానికి విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించడం నేరమన్నారు. ఇటువంటి ఘటనలపై సమాచారమివ్వాలన్నారు.


జీలుగుమిల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది


బుట్టాయగూడెం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు


టి.నరసాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రి వద్ద వైద్యుల నిరసన

దోషులను కఠినంగా శిక్షించాలి

» కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచారం పట్ల ఆందోళనలు » విధులను బహిష్కరించిన వైద్య సిబ్బంది » వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్

కోల్‌కతాలోని ఆర్‌జీకర్ వైద్య కళాశాలలో చదువుతున్న డాక్టర్ మౌమిత దేవ్‌నాద్ అనే వైద్యురాలి అత్యాచారం, హత్య ఘటనపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని అన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది దోషులను కఠినంగా శిక్షించాలంటూ శనివారం ర్యాలీలు ధర్నాలు నిర్వహించారు. వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.


దెందులూరులో వైద్య సిబ్బంది మానవహారం


నిడమర్రులో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

దెందులూరు, ఆగస్టు 17 : కోల్‌కతాలోని ఆర్‌జీకర్ వైద్య కళాశాలలో చదువుతున్న డాక్టర్ మౌమిత దేవ్‌నాద్ అనే వైద్యురాలిని హత్యాచారం చేసిన వారిని ఉరి తీయాలని దెందులూరు మండల వైద్యుల సంఘం నాయకులు, డాక్టర్ బి.సుందరబాబు డిమాండ్ చేశారు. దెందులూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వైద్యులు, డీఈడీ నర్సింగ్ కాలేజీ కరస్పాండెట్ ఎస్.నూకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు. పోతునూరు, గోపన్నపాలెం ప్రభుతాస్పత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

● బుట్టాయగూడెం : వైద్య విద్యార్థి నిపై హత్యాచారం చేసిన దుర్మార్గులకు కఠినంగా శిక్షించాలని, వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరుతూ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది అత్యవసర సేవలు మినహా విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. బుట్టాయగూడెం ప్రెస్ క్లబ్ సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండ్ డాక్టరు వసుందర, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది నిరసన తెలిపారు.

● టి.నరసాపురం : వైద్యురాలిపై హత్యాచాచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వైద్య సిబ్బంది టి.నరసాపురం, బొర్రంపాలెంలలో మానవహారం నిర్వహించి, నిరసన ప్రదర్శన చేశారు. అ.ర.సం రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాగర్, మండల వైద్యాధికారి జె.కల్పనా రాణి, డాక్టర్ ఆర్. ఫణీంద్రబాబు, ఎంఎస్‌ఏ ఖాదర్ భాషా, విజన్ స్కూల్ ప్రిన్సిపాల్, పి.శ్రీనివాస్, సాయి సూర్య హైస్కూల్ హెచ్ఎం కె.పవన్‌కుమార్, పలువురు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

● ఏలూరు టూ టౌన్ : వైద్య విద్యార్థిని పై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నింధితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, శ్యామలరాణి డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న వైద్యవిద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడి చంపడం సభ్యసమాజం సిగ్గు పడేలా చేసిందన్నారు. మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేసును పక్క దారి పట్టించే వాళ్ళను కూడా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహకారం అందించాలని డిమాండ్ చేశారు.

● జంగారెడ్డిగూడెం : వైద్య విద్యార్థిపై హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించారు. ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. అత్యవసర సేవలు మినహా విధులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. వైద్యులు వి.రాం బాబు, వి.శారద, ఎంఎం రామగోపాల శ్రీధర్,వంశీ కిరణ్, దీప్తి, ఉమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

● పోలవరం : కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యులు వైద్య సిబ్బంది నల్లబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ రాంబాబు, వైద్యులు విష్ణువర్ధిని, కృష్ణంరాజు, సునీల్ కుమార్, జ్యోతి, భార్గవ్, గుణశేఖర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : ట్రైనీ డాక్టర్ హత్యా చారం హత్యపై నిరసన వ్యక్తం చేస్తూ జీలుగుమిల్లిలో వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించారు. జగదాంబ సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి కొద్దిసేపు నిరసనలు వ్యక్తం చేశారు. వైద్యులపై దుశ్చర్య లకు పాల్పడటం హేయమైన చర్య అని దేశంలో వైద్యు లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. సంఘటనపై నిస్పక్షపాతంగా విచారణ జరిపి దోషుల్ని శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చెయ్యాలని నినాదాలు చేశారు. జీలుగుమిల్లి, కామయ్యపాలెం, రాచన్నగూడెం, పీహెచ్‌సీల వైద్యులు గాయిత్రి, దివ్య,హేమలత, రాగచందు, సిబ్బంది ప్రసాద్, మంగ పాల్గొన్నారు.

● లింగపాలెం, ఆగస్టు 17: డాక్టర్‌పై జరిగిన సామూహిక అత్యాచారాన్ని ఖండిస్తూ ధర్మాజీగూడె ంలోని పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. వైద్య విద్యార్థిని పై లైంగికదాడిని, హత్యఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని,ఇటువంటి ఘటనలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలన్నారు. డాక్టర్ యానిప్రీతి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : బెంగాల్‌లో వైద్యురాలి హత్యకు నిరసనగా కుక్కునూరు పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. హత్యకు బాధ్యులైన వారిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులు పూర్ణశ్రీనివాస్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● చింతలపూడి : స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద వైద్యులు, సిబ్బంది ధర్నా నిర్వహించారు. కోల్‌కత్తాలో వైద్య పీజీ విద్యార్థిని పై సామూహిక అత్యాచారం, హత్య సంఘటన నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఓపీ సేవలు రద్దుచేసి ధర్నా జరిపారు. కొద్దిసేపు సిబ్బంది నినాదాలు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ రసూల్, ఆర్ఎంవో డాక్టర్ హఫీజ్, డాక్టర్ జ్యోత్స్న, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండ్రు దేవ, భారతి, ఫ్లోరెన్స్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● నిడమర్రు : వైద్యులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని పెదనిండ్రకొలను పీహెచ్‌సీ వైద్యాధికారి కె.భాగ్యశ్రీ అన్నారు. కలకత్తాలో వైద్య విద్యార్థిపై జరిగిన దారుణ హత్యను నిరసిస్తూ వైద్య సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పడి వైద్యులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. డాక్టర్ తేజశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.





లింగపాలెం, చింతలపూడి, పోలవరం, కుక్కునూరులో విధులను బహిష్కరించి, నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

అధికారులు పూర్తి సమాచారంతో సమావేశాలకు రండి

చింతలపూడి, ఆగస్టు 17: మండల పరిషత్ సమావేశాలకు వచ్చేటప్పుడు ఆయా శాఖల అధికారులు తమశాఖ పై పూర్తి సమాచారంతో రావాలని, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు జరగాలని, అందుకు అధికారులు తమ శాఖల్లో సంబంధించిన పూర్తిసమాచారం పథకాల వివరాలు, వాటితో పాటు చేయబోయే పనులు ప్రతి పాదనలతో రావాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తనదృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఒక్కొక్క శాఖ మండలంలో చేపడుతున్న పనులపై ప్రశ్నించారు. సీతానగరం ఎంపీటీసీ కె.రామారావు మాట్లాడుతూ, యండపల్లి సర్పంచ్ యడ్ల మోహన్, యర్రగొండపల్లి ఎంపీటీసీ విజయ్‌భాస్కర్, తిమ్మిరెడ్డిపల్లి సర్పంచ్ శ్యామ్‌శేఖర్, వారి గ్రామాల్లోని సమస్యలను తెలిపారు. మండల వైద్యా అధికారి కిరణ్ చైతన్య, రోడ్లు భవనాల శాఖ ఏఈ సుందరం, ఎంఈవో రామారావు వారి శాఖల ప్రగతిని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు, ఎంపీడీవో మురళీకృష్ణ, జడ్పీటీసీ నీరజ, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడారు.


చింతలపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి

లింగపాలెం : విద్యార్థులు చదువుతో పాటు ఆట పాటల్లో రాణించాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. సుందర్రావుపేటలో దేవరపల్లి విజ్ఞేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న వారికి ఎమ్మెల్యే శనివారం బహుమతులు అందజేశారు. గ్రామానికి చెందిన దేవరపల్లి తంబి అనే వ్యక్తి తన భార్య పేరిట సేవా కార్యక్రమాలు చేయటం, ఆటల పోటీలు నిర్వహించి అందులో పాల్గొన్న వారికి నగదు బహుమతులతో పాటు పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం వారిపేరిట కొంత డబ్బు జమచేయటం ఆయన దాతృత్వానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఏలూరు సెయింట్ వికాస్ జనరల్ ఫాదర్ బాల, గరిమెళ్ళ చలపతిరావు, పలువురు జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెం గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు గారపాటి బుజ్జియ్య పరసా రాజారావు, మోరంపూడి ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలవరం భూసేకరణ

ఫైళ్ళ దగ్ధం పై ఎంపీ మహేష్ ఆరా



ఏలూరు టూ టౌన్, ఆగస్టు 17: పోలవరం భూసేకరణ ఆఫీసులో ఫైళ్ళ దగ్ధం ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. ధవళేశ్వరంలోని పోలవరం కుడి కాల్వ భూసేకరణ కార్యాలయంలో ఫైళ్ళు దగ్ధమైనట్లు సమాచారం ఉందన్నారు. ఫైళ్ళ దగ్ధం పై విచారణ జరిపి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. దోషులు ఎలాంటివారైన వదిలేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీ మహేష్ హెచ్చరించారు. మొన్న కృష్ణానది ఒడ్డు ఎక్సైజ్ శాఖ ఫైళ్ళు దగ్ధం చేశారని మళ్ళీ ధవళేశ్వరంలో ఫైళ్ళ దగ్ధం జరిగిందన్నారు. ఇలాంటి ఘట నలు మరలా జరగకుండా తగు చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు


మొక్కలు నాటుతున్న నాయకులు

ఏలూరు రూరల్, ఆగస్టు 17: మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని చిరంజీవి యువత, మెగా ఫ్యామిలీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో శనివారం మొక్కలు నాటారు. అనంతరం తంగెళ్ళమూడి, సెయింట్ జోసఫ్, మానసిక దివ్యాంగుల వసతి గృహంలో ఒక రోజు భోజనం, పండ్లు పంపిణీ చేశారు. శానం శ్రీరామకృష్ణ, నారా శేషు, పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి నీరు పోశారు. వారు మాట్లాడుతూ బ్లడ్ బ్యాంకు, ఐబ్యాంక్‌ల ద్వారా చిరంజీవి ఎంతో మందికి అండగా నిలిచారన్నారు. పెదబాబు, పవన్, అరవింద్, ఆది, ప్రసాద్,పండు, ఎల్.రమేష్, హనుమంతురావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 17 : కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యోదంతంపై తక్షణమే ప్రత్యేక కోర్టుని ఏర్పాటు చేసి, నేరస్తులకు కఠిన శిక్షపడేలా చూడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. రెండు రోజులుగా స్థానిక సీఐటీయూ కార్యా లయంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావే శాల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. అశోక్ మాట్లాడుతూ ఆస్పత్రి విధుల్లో ఉన్న సిబ్బందికి రక్షణ కల్పించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే పనులు కూడా ప్రభు త్వాలు చేయడం లేదన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల ను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆలిండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్, వినోద్, పరమేశ్, సహాయ కార్యదర్శులు వెంకటే శ్వర్లు, రవి, వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు లెనిన్ పాల్గొన్నారు.

మానవత సంస్థ ద్వారా ప్రజలకు సేవలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 17: మానవత సంస్థ వివిధ సేవలు అందిస్తూ ప్రజలకు ఎంతో చేరువైందని ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు దేవరపల్లి రాయుడు బాబు అన్నారు. ద్వారకాతిరుమలలో మానవత ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా ఆగస్టు 15 నుంచి 22 వరకూ మానవతా శాంతి వారోత్సవాలను చేస్తున్నామన్నారు. ద్వారకాతిరుమలలో శ్రీవారి ఆర్చి గేటు వరకూ ర్యాలీ చేశారు. విద్యార్థులు, మానవతసభ్యులు మొగతడకల లక్ష్మీరమణి, తూంపాటి పద్మవరప్రసాద్, పావులూరి మధు, బొప్పన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నారాయణపురంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉషోదయ హైస్కూలు నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల గుండా సాగింది. ఉంగుటూరు శాఖ అధ్యక్షులు వి.రంగరాజు, కార్యదర్శి జి.రవి,రీజియన్ చైర్మెన్ పి.గోపి,మండల చెర్మెన్ జి.బుల్లెబ్బాయి, కన్వీనర్ ఎ.శ్రీనివాసరావు, కె.సర్వేశ్వరరావు, బి.అప్పారావు, సూర్యనారాయణరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ద్వారకాతిరుమల :** చిన్నతిరుమలేశుని ఆలయంలో శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో తెలిసీ, తెలియక జరిగిన తప్పుల ప్రాయచిత్తం నిమిత్తం ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం పరిపాటి. అధిక సంఖ్యలో భక్తుల రాకతో శ్రీవారి క్షేత్రం కళకళలాడింది. శ్రీవారి సాధారణ దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.
- **ఉంగుటూరు :** సీజనల్ ఫీవర్లపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి వైద్యాధికార్లకు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కాగుపాడు పీహెచ్‌సీలో శనివారం ఎంపీపీ శ్రీలక్ష్మి, సర్పంచ్ కడియాల సుదేష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో హనమ, వైద్యాధికారి మానసతో వివిధ అంశాలపై సమీక్షిం చి, ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
- **భీమడోలు :** పూళ్ళ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలు ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. టీడీపీ నాయకులు పుప్పాల హరీష్ ఆధ్వర్యంలో బలపర్చిన 24 మంది అభ్యర్థులతో విద్యా కమిటీని శనివారం ఎంపిక చేశారు. కాసాని రామలక్ష్మి ఛైర్మన్, కూటికుప్పల నాగసావిత్రి వైస్ ఛైర్మన్‌గా ఎన్నిక య్యారు.
- **బుట్టాయగూడెం :** మలేరియా నివారణలో భాగంగా దొరమామిడి పీహెచ్‌సీ పరిధిలోని గొట్టాలరేవు, చింతకొండ, రెడ్డిబోడ్డేరు కొండరెడ్డి గ్రామాల్లో శనివారం మలేరియా అధికారులు దోమల మందు పిచికారీ చేశారు.
- **కుక్కునూరు :** గ్రామంలోని స్లోకా కన్‌సెప్ట్ స్కూలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం బహుమతులు అందజేశారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖోతో పాటు పలు పోటీలు నిర్వహిం చారు.

సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 17: పోడేలు గ్రామానికి చెందిన వై.నాగేంద్ర పేగు క్యాన్సర్ వైద్యానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్షా 50 వేలు సహాయం చేశారు. బడేటి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య(చంటి) సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే చంటి ఇచ్చిన హామీ మేరకు నాగేంద్రకు ఆర్థిక సాయం చేసేందుకు ఎమ్మెల్యే కృషి చేశారు.

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మేజిస్ట్రేట్ ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న మెజిస్ట్రేట్ తేజస్వి

కుక్కునూరు, ఆగసు 17: రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం కుక్కునూరు, వేలేరు పాడుల్లో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాల యాల్లో జంగారెడ్డి గూడెం జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ అధికారిని కేఎస్ఆర్ తేజస్వి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వసతి గృహాల్లో మరుగుదొడ్ల నిర్వహణ, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, ఆట స్థలాలను పరిశీలించారు. అలాగే విద్యార్థుల తరగతి గదులను సందర్శించి బోధనా విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం మెనూ పై ఆరా తీశారు. అలాగే రికార్డులను పరిశీలించారు.

క్రీడా పురస్కారాలకు ప్రాథమిక జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పండి : డీఈవో

ఏలూరు అర్బన్, ఆగస్టు 17 : హాకీ లెజెండ్ దివంగత ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు డీఈవో అబ్రహం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరిచిన జిల్లాలోని ఐదు పాఠశాలలకు 'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ -2024' పురస్కారాలను అందజేసేందుకు స్వీకరించిన దరఖాస్తుల్లో పెదవేగి ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్(250 పాయింట్లు), ఏలూరు సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాల(137), ఏలూరు కస్తూరిబా బాలి కోన్నత మున్సిపల్ హైస్కూలు(107), వట్లూరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్(67), పోణంగి జడ్పీ హైస్కూలు(53), కలపర్రు జడ్పీ హైస్కూలు(52) పాయింట్ల సాధనలో ముందున్నాయని సంబంధిత జాబితాను విడుదల చేశామన్నారు. ఆయా పాఠశాలలు సాధించిన పాయింట్లలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 18న సాయంత్రం ఐదు గంటల్లోగా డీఈవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు.

బీఎల్‌వోలకు ఓటర్ జాబితా సవరణ విధులా?

ఏలూరు రూరల్, ఆగస్టు 17: బీఎల్‌వోలకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం ఇవ్వకుండా తాజాగా ఓటర్ల జాబితా సవరణలో పాల్గొనాలని ఆదేశాలు ఇవ్వడం సరికాదని పాత బకాయిలు తక్షణం చెల్లించాలని, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే ఓటర్ల జాబితా సవరణలో పాల్గొనాలనడం సమంజసం కాదన్నారు. నాలుగేళ్ళుగా బీఎల్‌వోలకు రావాల్సిన గౌరవ వేతనం తక్షణం ఇప్పించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్ళినా నేటి వరకు పైసా విదిల్చలేదన్నారు. మళ్ళీ బీఎల్‌వో విధులు నిర్వహించాలంటే ముందుగా పాత బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి

కోల్‌కతలో వైద్యురాలిపై హత్యాచారం నిరసిస్తూ ప్రదర్శనలు, ర్యాలీలు ● దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



కైకలూరులో నిరసన తెలుపుతున్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు



కలిదిండిలో నల్ల రిబ్బన్లు ధరించి వైద్యాధికారులు, సిబ్బంది నిరసన



దేవపూడిలో వైద్యాధికారులు, సిబ్బంది ప్రదర్శన



ముసునూరు మెయిన్ సెంటర్‌లో మానవహారం

కైకలూరు, ఆగస్టు 17: ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే వైద్యులకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రైవేటు వైద్యులు డిమాండ్ చేశారు. ఇటీవల కోల్‌కతలో ఆర్జీకార్ మెడికల్ కళాశాల వైద్యురాలిపై గ్యాంగ్ రేప్, హత్యకు నిరసనగా కైకలూరులో నిరసన ర్యాలీ చేశారు. వైద్యురాలి హత్యకు నిరసనగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ వైద్య సేవలు నిలిపి వేస్తున్నామన్నారు. దోషులను శిక్షించి ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు. వైద్యులు జీపీ చౌదరి, ఎం. సురేఖ, ప్రశాంతి, ఎం. నాగ ప్రియ, జి. హరీష్, పుల్లేశ్వరరావు, బి. విద్యాసాగర్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ శనివారం కలిదిండిలో వైద్యాధికారులు, సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ప్రదర్శన తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యాధికారులు సుచిత, హేమంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కిషోర్ నాగమణి, ఏఎన్‌ఎంలు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆర్‌ఎంపీ, పీఎంపీలు శనివారం వైద్య సేవలను నిలిపివేసి బంద్ పాటించినట్టు జిల్లా అధ్యక్షుడు బి.వెంకట రాజు శనివారం ప్రకటనలో తెలిపారు.

ముదినేపల్లి: వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం ముదినేపల్లి మండలంలో ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ముదినేపల్లి, దేవపూడి పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ వినయ్, మధు, శాంతిశ్రీ, శ్వేత ఆధ్వర్యంలో సిబ్బంది ముదినేపల్లి, దేవపూడి గ్రామాల్లో నిరసన ప్రదర్శనలు జరిపి ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. దేవపూడి హెల్త్ సూపర్‌వైజర్ కె.పద్మ, ల్యాబ్ టెక్నీషియన్ వి.వెంకటేశ్వరరావు, ముదినేపల్లి హెల్త్ సూపర్‌వైజర్ శాంతి, ఏఎన్‌ఎంలు తదితరులు ప్రదర్శనలో పాల్గొన్నారు.

ముసునూరు: వైద్య ఆరోగ్య సిబ్బందిపై దాడుల నివారణకు రక్షణ చట్టం తీసుకురావాలి వైద్యాధికారిణి డాక్టర్ షకీనా ఇవాంజలి అన్నారు. వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం ముసునూరులో వైద్య సిబ్బంది ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇవాంజలి మట్లాడుతూ దోషులను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, బాలికలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాణి

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలి

ముసునూరు, ఆగస్టు 17: ఉపాధి పథకం నిధులతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీవో జి.రాణి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో రోజ్‌లీల అధ్యక్షతన ఉపాధి గ్రామ సభల నిర్వహణ, అభివృద్ధి పనుల ప్రణాళికలపై అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకంలో వచ్చిన నిధులను గ్రామాల్లో అవసరమైన రహదారులు, డ్రెయినేజీలు తదితర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఈ నెల 23న ప్రజాప్రతినిధులు, అధికారులు అన్ని పంచాయతీల్లో గ్రామ సభలను ఏర్పాటు చేసి, ఈ అభివృద్ధి పనులపై సమీక్షించి తీర్మానాలు చేయాలన్నారు. అనంతరం ఉపాధి పథకం ద్వారా జరుగుతున్న పనులు, పండ్ల తోటల పెంపకంపై సబ్సిడీ వివరాలను ఈసీ జయప్రసాద్ వివరించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీ గంగాధరరావు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మట్టి, ఇసుక దందాపై బహిరంగ చర్చకు సిద్ధమా?

నూజివీడు టౌన్, ఆగస్టు 17: ముసునూరు మండలంలో జరిగిన మట్టి, ఇసుక దందాపై వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ టీడీపీ నాయకులు సవాల్ విసిరారు. నూజివీడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ముసునూరు మండల టీడీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇటీవల ముసునూరు మండలం సూరేపల్లి చెరువులో మట్టి తోలకాల్లో పట్టుబడిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు వైసీపీ నాయకులవే అన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు దేవినేని డేలారామ్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గద్దె రఘు, ముసునూరు మండల క్లస్టర్ ఇన్‌చార్జి సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

రికవరీకి ఆదేశాలిస్తా : డ్వామా పీడీ

నూజివీడు టౌన్, ఆగస్టు 17: ఉపాధి పథకం అమలు స్కామ్‌లా ఉందని డ్వామా పీడీ ఎ.రాము అన్నారు. మండలంలో సామాజిక తనిఖీ సభను శనివారం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కార్యక్రమానికి హాజరు కాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనుల్లో మస్టర్ నమోదులో అవకతవకలు, సంతకాలు లేకుండా నగదు చెల్లింపులు తదితరాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ రికవరీకి ఆదేశాలు జారీ చేస్తామన్నారు. 17వ సోషల్ ఆడిట్‌లో 29 గ్రామాలకు సంబంధించి మొత్తం రూ.17.01 కోట్లకు సంబంధించి సోషల్ ఆడిట్‌ను నిర్వహించారు. ఏపీడీ శ్రీదేవి, పీవో విజయలక్ష్మి, ఎస్‌ఆర్‌పీ సూర్యచక్ర తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే శిక్షార్హులు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి పెదఖాసిం

నూజివీడు టౌన్, ఆగస్టు 17: నూజివీడు ఎస్‌ఆర్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నూజివీడు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కె పెదఖాసిం అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహ నాలు నడపడం వల్ల వాహన దారుడితో పాటు వాహనాన్ని నడిపి న వ్యక్తి కూడా శిక్షార్హులవుతారన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ, చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్య ప్రకాష్, సీనియర్ న్యాయవాది బసవరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తిచేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీజీఎం

ముసునూరు, ఆగస్టు 17: పీఏసీఎస్‌లలో సమగ్ర కంప్యూటరీకరణను త్వరిత గతిన పూర్తిచేయాలని కేడీసీసీ బ్యాంక్ డీజీఎం కాగిత శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలో చింతలవల్లి, ముసునూరు, చెక్కపల్లి, కాట్రేనిపాడు తదితర గ్రామాల్లోని సొసైటీలను డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పద్మశ్రీతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీల్లో రుణాల వివరాలు, రైతుల ఆధార్ తదితర వాటికి సంబంధించిన కంప్యూటరీకరణను ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ముసునూరు కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ రంగప్రసాద్, సూపర్‌వైజర్ రామ్‌శంకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

ముసునూరు, ఆగస్టు 17: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి అవసరమైన బోధనా విధానాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో సుబ్బారావు అన్నారు. శనివారం ముసునూరు జడ్పీ పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల కాంప్లెక్స్‌లో పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించాలని ఎంఈవో కోరారు. హెచ్‌ఎంలు ఏ.సునీల, శ్రీనివాస్, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన పోతనపల్లి ఎస్‌ఎంసీ కమిటీతో ప్రమాణ స్వీకారం

పోతనపల్లి ఎస్‌ఎంసీ ఎన్నిక

చాట్రాయి, ఆగస్టు 17: వాయిదా పడిన పోతనపల్లి యూపీ స్కూల్ ఎస్‌ఎంసీకి శనివారం ఎన్నిక నిర్వహించారు. 8వ తేదీన ఇక్కడ పదవుల విషయంలో అవగాహన కుదరకపోవటంతో ఎన్నిక వాయిదా వేశారు. ఛైర్మన్‌గా నక్కా నారాయణ, వైస్ ఛైర్మన్‌గా జోనుబోయిన సుధారాణి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, హెచ్‌ఎం విప్లవకుమార్ ప్రకటించారు. ఎన్నికల పరిశీలకులుగా ఎ.వి. వెంకటేశ్వరరావు, ఎస్. రాము, వెదుళ్ళ వెంకటేశ్వరరావు వ్యవహరించగా, ఎంఈవో వీయస్వీ బ్రహ్మచారి పర్యవేక్షించారు.



పెదలంక జడ్పీ హైస్కూల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌కు పలువురి అభినందన

కలిదిండి: మండలంలో పెదలంక జడ్పీ హైస్కూల్ ఎస్‌ఎంసీ ఎన్నిక శనివారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు. ఛైర్మన్‌గా పాకాల శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్‌గా నాగిడి రాజేశ్వరి ఎన్నికయ్యారన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ముద్దం భోగేశ్వరరావు, అక్కల బోసు, దుగ్గిరాల చంద్రశేఖర్, వీరబాబు, చాబత్తిన శ్రీనివాసరావు, రెడ్డి చక్రవర్తి, కొల్లాటి సత్యనారాయణ, నడకుదుటి గణపతి, వాతాడి రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను అభినందించారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కోర్టులలో సెప్టెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ తెలిపారు. ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. పురుషోత్తమ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు.

దేశం గర్వించే రీతిలో విద్యార్థులు ఎదగాలి

ఐఐటీ అల్యుమ్ని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ
ఏపీ నిట్‌లో ఘనంగా ఆరో స్నాతకోత్సవం



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ముఖ్య అతిథి డాక్టర్ రవిశర్మ, ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 17: దేశం గర్వించే రీతిలో విద్యార్థులు వినూత్న పరిశోధనలు , ఆవిష్కరణలు చేపట్టాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్, ఐఐటీ అల్యుమిని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ అన్నారు. ఏపీ నిట్‌లో 6వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు.రవిశర్మ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్తకొత్త సాంకేతికతలు ఆవిష్కృతం అవుతున్నాయని వాటిలో మెలుకువలు నేర్చుకుని పట్టు సాధించిన వారు అగ్రస్థానాల్లో నిలుస్తారన్నారు. విద్యార్థులు సరైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ పరిశోధన, అభివృద్ధికి పెద్ద పీట వేసినప్పుడే ప్రగతి పథంలో పయనించేందుకు వీలుంటుందన్నారు. నిట్‌లో ప్రయోగశాల, పరిశోధనపరికరాల సేకరణ, మౌలిక సదుపాయాల నిమిత్తం కేంద్రం రూ.754 కోట్లు మంజూరు చేయనుందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు కొత్త పాఠ్యాంశాలను అందుబాటులో తీసుకురానున్నా మన్నారు. తొలుత 2020-24 విద్యాసంవత్సరంలో బీటెక్ పూర్తి చేసుకున్న 527 మంది విద్యార్థులకు, ఎంటెక్ పూర్తిచేసిన 15 మంది విద్యార్థులకు డిగ్రీలు,25 మంది పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలు అందజేశారు.

బంగారు పతకాల విజేతలు

బయో టెక్నాలజీలో రామిరెడ్డి వెంకటసాయిరెడ్డి 9.62 గ్రేడ్ పాయింట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో మంకాల కార్తిక్ 9.44, సివిల్‌లో గుబ్బల హారిక 9.12, కంప్యూటర్ సైన్స్‌లో సలాడి వెంకట శశిభూషణ్ 9.83, ఈఈఈలో రెడ్డి వీర వెంకటసాయికృష్ణ అనిల్ 9.27, మెకానికల్‌లో మంత్రిప్రగడ సాయి అఖిల్ 9.56, మెటలార్జికల్ ఇంజనీరింగ్‌లో గంటా మోహిత్ యాదవ్ 8.83లతో పాటు 2020-24 అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన వెంకట శశి భూషణ్‌కు ఇనిస్టిట్యూట్ తరపున బంగారు పతకాలను అందజేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ ఆర్‌కే శాస్త్రి, డాక్టర్ టీ.కురుమయ్య, డాక్టర్ వీరేష్‌కుమార్, డాక్టర్ ఎన్.జయరాం, డాక్టర్ కార్తిక్ శేషాద్రి, అసోసి యేట్ డీన్ డాక్టర్ సందీప్, సెనెట్ సభ్యులు, విభాగాదిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తగా రాణించాలి : వెంకట శశిభూషణ్



నాన్న సుబ్బారావు ప్రైవేటు ఉద్యోగి. అమ్మ గృహిణి. మాది తణుకు.కంప్యూటర్ సైన్స్‌లో 9.83 గ్రేడు పాయింట్లు సాధించి ఇన్‌స్టిట్యూట్ టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం హైదారాబాద్‌లోని పేపాల్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాను.శాస్త్రవేత్తగా రాణించాలనేది నా లక్ష్యం..

ఇంజనీర్‌గా స్థిరపడాలి : గుబ్బల హారిక



నాన్న శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అమ్మ కనకలత జూనియర్ ఇంజనీర్. మాది రామచంద్రపురం. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 9.12 గ్రేడు పాయింట్లు సాధించడం ఆనందంగా ఉంది. ఈఎస్‌సీ సర్వీసెస్‌లో ఇంజనీర్‌గా స్థిరపడాలనేది నా ఆశయం

నా కల సాకారమైంది : మంత్రిప్రగడ సాయి అఖిల్



నాన్న శ్రీనివాసరావు సీనియర్ ఎకౌంట్ మేనేజర్. అమ్మ సూర్యకుమారి గృహిణి. మాది విజయవాడ. మెకానికల్‌లో 9.56 పాయింట్లు సాధించాను. ప్రస్తుతం నేను క్యాట్ విజన్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. వార్షిక వేతనం రూ7.5 లక్షలు అందుకుంటున్నాను. నాకల సాకారమైనందుకు సంతృప్తిగా ఉంది.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి : టంకాల దీప్తి సాయి



నాన్న గుప్తా వ్యాపారవేత్త. అమ్మ జయలక్ష్మి గృహిణి. మాది శ్రీకాకుళం. ఈఈఈలో 9.09 గ్రేడు పాయింట్లు సాధించడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం ఎల్‌అండ్‌టీ కంపెనీలో గ్యాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీగా చేస్తు న్నాను. వార్షిక వేతనం రూ 6.5 లక్షలు. నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటే ఏరంగంలోనైనా రాణించవచ్చు.

ముగిసిన పవిత్రోత్సవాలు



ఆగిరిపల్లి, ఆగస్టు 17: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి పవిత్రోత్సవాలు శనివారంతో ముగిసినట్టు ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు తెలిపారు. శనివారం నిత్య హోమం, పవిత్రముల విసర్జన, మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం, అన్నప్రసాద వితరణ జరిపారు. ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు, రామ అనంతకృష్ణ, వేదాంతం లీలామనోహర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

జాతీయ స్థాయి కోడింగ్ హ్యాకథాన్ పోటీలు



ఆగిరిపల్లి, ఆగస్టు 17: స్థానిక ఎన్‌ఆర్‌ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ స్థాయి కోడింగ్ కాంపిటీషన్స్ 'హ్యాకథాన్ 4.0' సెప్టెంబరు 20, 21 తేదీల్లో కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్టు కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఆర్. వెంకట్రావు తెలిపారు. జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులు బృందాలుగా ఏర్పడి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, వేస్ట్ మేనేజ్‌మెంట్స్ వంటి అంశాలపై కోడింగ్ చేసి సమాజంలోని సమస్యలకు పరిష్కారం అన్వేషించే ఈ పోటీలకు ఎన్‌ఆర్‌ఐ శ్రీకారం చుట్టిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. నాగభాస్కర్ తెలిపారు. పోస్టర్ల ఆవిష్కరణలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి. సాంబశివరావు, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ డి.సునీత, ఐటీ విభాగాధిపతి డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ సురేంద్రబాబు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులుంటాయన్నారు.

ఏలూరు తరలిన మాలమహానాడు కార్యకర్తలు

ముదినేపల్లి, ఆగస్టు 17 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శనివారం ఏలూరులో మాలమహానాడు, అనుబంధ సంఘాలు నిర్వహించిన కార్యక్రమానికి ముదినేపల్లి మండలం నుంచి పలువురు కార్యకర్తలు తరలివెళ్లారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి వర్గీకరణ వ్యతిరేక పాదయాత్రలో పాల్గొన్నారు.

దుర్గారావుకు ఘన నివాళి

నూజివీడు టౌన్, ఆగస్టు 17: సీపీఎం సీనియర్ నాయకుడు ఎలినేని దుర్గారావు మృతిపట్ల ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు సంతాపం తెలిపారు. దుర్గారావు అంత్యక్రియలు శనివారం జరిగాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రాజు, రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నరసింహ, కె.శ్రీనివాస్, ఎస్‌ఆర్ హనుమాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ



ముదినేపల్లి, ఆగస్టు 17 : మండలంలోని చేవూరు యూపీ పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామ ప్రముఖుడు పోలవరపు చంటిబాబు నోటు పుస్తకాలు అందజేశారు. తన తల్లి దండ్రులు హరిశ్చంద్రయ్య, సీతామహాలక్ష్మి స్మృత్యర్థం చంటి బాబు శనివారం రూ.5 వేల విలువైన పుస్తకాలను అందజేశారు. సర్పంచ్ వల్లభనేని లక్ష్మి, హెచ్‌ఎం వల్లూరు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఏటీఎం దోపిడీ యత్నంపై కేసు నమోదు

ముదినేపల్లి, ఆగస్టు 17: ముదినేపల్లిలో ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున జరిగిన యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం చోరీకి యత్నం ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీఎం పగులగొట్టి చోరీకి యత్నించిన ఘటనపై ఆ బ్యాంక్ క్యాష్ సూపర్‌వైజర్ ఫణి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్ కుమార్ తెలిపారు.

టీ తాగుతూ కుప్పకూలిపోయాడు..

ఏలూరు క్రైం, ఆగస్టు 17: ఒక హోటల్ వద్ద టీ తాగుతున్న వ్యక్తి అకస్మాత్తుగా అక్కడే కూలబడి మృతి చెందాడు. ముసునూరు మండలం గోపవరానికి చెందిన గొర్రిముచ్చు శేషు (40)కు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి. ఆమె ప్రసవం కోసం నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆమెకు రక్తం అవసరం ఉందని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి తీసుకురావాలని అక్కడి వైద్యులు సూచించగా శనివారం సాయంత్రం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. ఆసుపత్రి గేటు పక్కనే ఉన్న హోటల్ వద్దకు వెళ్ళి టీ తాగుతూ నెమ్మదిగా కింద కూర్చుండిపోయాడు. పరిస్థితి గమనించిన అక్కడి వారు ఆసుపత్రి సిబ్బందికి చెప్పడంతో వారు అతనిని అత్యవసర విభాగానికి తీసుకువెళ్ళారు. అప్పటికే మృతి చెందాడని డాక్టర్ జ్యోతి నిర్ధారించారు. అతని వద్ద బ్లడ్ శాంపిల్ స్లిప్‌పై ఫోన్ నెంబర్ ఉండడంతో అతని బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని అప్పగించారు. గుండెపోటు వల్లే మరణించాడని నిర్ధారణ చేశారు.

మత వివక్ష లేకుండా పెంచి పెద్దచేసి..



బాబూజీ, హసీనాను సన్మానిస్తున్న బీజేపీ, జనసేన నాయకులు

ముదినేపల్లి, ఆగస్టు 17 : పర మతం అనే వివక్ష లేకుండా తనను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఒక హిందూ కుటుంబం ఇచ్చిన ప్రోత్సాహానికి ఆశించిన రీతిలో ఫలితాన్ని చూపించింది ఆ ముస్లిం యువతి. ముదినేపల్లికి చెందిన అతి పేద కుటుంబంలో జన్మించిన షేక్ హసీనాను పెంచి పోషించేందుకు కూడా ఆమెను కన్న తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేకపోవటంతో పక్కనే నివాసం ఉంటున్న హిందువులైన సాక్షి బాబూజీ, నాగమణి దంపతులు 2 నెలల ప్రాయంలోనే ఆ చిన్నారిని ముస్లిం అన్న భేదం లేకుండా తమ ఇంట్లోనే పెంచారు. తమ పిల్లలతో పాటే బాబూజీ దంపతులు విద్యాబుద్ధులు నేర్పించారు. ముదినేపల్లి హైస్కూల్‌లో పదో తరగతి మంచి మార్కులు సాధించటంతో హసీనాకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అక్కడే ఈ ఏడాది ఇంజనీరింగ్ పాస్ కాగా, క్యాంపస్ సెలక్షన్స్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో రూ.6 లక్షల ప్యాకేజీతో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఉద్యోగం సాధించింది. మత వివక్ష లేకుండా ఉదార స్వభావంతో హసీనాను పెంచి జీవితానికి భద్రత కల్పించిన బాబూజీతో పాటు షేక్ హసీనాను శనివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి వేల్పూరి నానాజీ తదితరులు సన్మానించారు.

చేతిరాత పోటీల్లో లక్ష్మీకావ్య ప్రతిభ



కైకలూరు, ఆగస్టు 17: ఇటీవల ఆన్‌లైన్లో జరిగిన జాతీయ స్థాయి చేతి రాత పోటీల్లో కైకలూరు నేషనల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని సీహెచ్. లక్ష్మీకావ్య వండర్ ఆఫ్ బెస్ట్ హ్యాండ్ రైటింగ్ విభాగంలో మొదటి స్థానం సాధించింది. జాతీయ స్థాయిలో మొదటి 13 స్థానాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు నాలుగు స్థానాలు సాధించినట్లు నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ చంద్రమోహన్ తెలిపారు. లక్ష్మీకావ్యను కైకలూరు మండల విద్యాశాఖాధికారి డి. రామారావు, పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు.

ఎంపీడీవోలకు సత్కారం



ముదినేపల్లి ఎంపీడీవోలకు ఎంపీపీ సత్కారం

ముదినేపల్లి, ఆగస్టు 17 : ముదినేపల్లి నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు ఎంపీడీఓగా బదిలీ అయిన ఎన్.మురళీ గంగాధరరావును, పల్నాడు జిల్లా పెదకూర పాడు నుంచి ముదినేపల్లి ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన పి.మల్లీశ్వరిని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ సత్కరించారు. మండలంలో ప్రమోషన్‌పై ఇతర మండలాలకు బదిలీ అయిన పంచాయతీల కార్యదర్శులు జి.రమేష్, శ్యామ్ సుందర్, నాగలక్ష్మి, షెహనాజ్ బేగంను కూడా సన్మానించారు. వైస్ ఎంపీపీలు సునీత, సుకన్య, మండల పరిషత్ ఏవో రమణబాబు, ఎస్ఏ నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజె ఆవిర్భావ దినోత్సవం



ప్రభుత్వాసుపత్రిలో పండ్ల పంపిణీ

కైకలూరు, ఆగస్టు 17: ఏపీయూ డబ్ల్యూజె 67వ ఆవిర్భావ దినోత్సవం సంద ర్భంగా ప్రభుత్వా సుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. శనివారం కైకలూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎ.వి. శ్రీనివాసరావు, కైకలూరు మండల అధ్యక్షుడు బి. శ్యామలరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి పెద్ది సురేష్, జిల్లా కార్యవర్గసభ్యుడు అంకెం రాము, సీనియర్ పాత్రికేయులు రాధాకృష్ణ, శ్యాంసువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదుతో లాభాలెన్నో..



కైకలూరు, ఆగస్టు 17: ప్రతి రైతు ఈ క్రాప్‌లో పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వ పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. శనివారం కైకలూరు మండలం వింజరంలో ఈక్రాప్ నమోదును పరిశీలించి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వీఏఏలు ఈ క్రాప్‌లో సాగు రైతు వివరాలు, పంట వివరాలు నమోదు చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలతో పాటు ధాన్యం కొనుగోలు చేయాలన్నా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపరిహారం అందాలన్నా ఈ క్రాప్‌లో నమోదై ఉండాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఈక్రాప్ ఉపయోగాలను వివరించారు. అనంతరం కైకలూరు వ్యవసాయ శాఖ కార్యాల యంలో కైకలూరు, కలిదిండి మండలాల ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు జరగాలన్నారు. చట్టాల్లో కొత్తగా వచ్చిన సవరణలను డీలర్లకు వివరించారు. ఏడీఏ ఆర్. గంగాధరరావు, మండల వ్యవసాయాధికారిణి ఆర్. దివ్య, రైతులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: ప్రతి రైతు తమ పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా సూచించారు. బోర్వంచలో పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర, ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టం ఇన్‌ఫుట్ సబ్సిడీ తదితరాలు అందాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. ఏవో ఎ.చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.